పశ్చిమ డెల్టాకు నీరు విడుదల

దుగ్గిరాల: కృష్ణా పశ్చిమ డెల్టా కాల్వలకు ఆదివారం సీతానగరం నుంచి 8004 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. సుమారు 5.71 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న పశ్చిమ డెల్టాలో ఈ ఏడాది దాదాపు 5 లక్షలు సాగులో ఉంది. ఇటీవల వర్షాలు పడగా కాలువకు నీటి విడుదల తగ్గించి, ఇప్పుడు పెంచారు. ఈ నేపథ్యంలో దుగ్గిరాల నుంచే అన్ని కాల్వలకు విభజన జరుగుతోంది. పెదవడ్లపూడి ఉన్నత వాహినికి 330, రేపల్లె కాల్వ(బ్యాంక్ కెనాల్)కు 1820, తూర్పు కాల్వకు 680, పశ్చిమ కాల్వకు 236, నిజాంపట్నం ఛానల్‌కు 450, కొమ్మమూరు కాల్వకు 3320 క్యూసెక్కులు నీరు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

సుందర రూపిణి.. సుమధుర భాషిణి







లలితా త్రిపుర సుందరికి భక్త నీరాజనం

జగన్మాత దర్శనానికి వేచి ఉన్న భక్తులు

ఈనాడు, డిజిటల్-అమరావతి

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. శ్రీచక్ర అధిష్ఠానశక్తిగా, పంచదశాక్షరీ మహా మంత్రాధి దేవతగా.. లక్ష్మీదేవి, సరస్వతీదేవి ఇరువైపులా వింజామరలతో సేవిస్తూ ఉండగా చిరుమందహాసంతో చెరకుగడను చేతపట్టుకుని శివుని వక్షస్థలంపై కూర్చుని కాంతులీనిన లలితా త్రిపుర సుందరీదేవిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. వేకువన 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకే.. అమ్మవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 55 వేలు దాటిపోయింది. అప్పటికి ఇంకా క్యూలైన్లలో భక్తులు కిక్కిరిసి ఉన్నారు. సాయంత్రం నుంచి మరింత ఎక్కువ రద్దీ పెరిగింది. ఉత్సవాల నాలుగు రోజుల్లో 2.80 లక్షల మంది భక్తులు అమ్మను దర్శించుకున్నారు.

భారీగా పెరిగిన ఆదాయం.. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల నుంచే క్యూలైన్లు కిక్కిరిశాయి భక్తుల రద్దీ భారీగా ఉండడంతో ప్రసాదాలు, దర్శన టిక్కెట్లు, పూజలు, కేశఖండనశాలపై వచ్చే ఆదాయం కూడా పెరిగింది. మొదటి రోజు రూ.28 లక్షలు, రెండో రోజు రూ.47 లక్షలు, మూడో రోజు రూ.54 లక్షల ఆదాయం రాగా.. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం 5 గంటల సమయానికే రూ.70 లక్షల ఆదాయం వచ్చింది. మొత్తంగా నాలుగో రోజు సాయంత్రానికి.. రూ.2 కోట్ల వరకు ఆదాయం ఆలయానికి వచ్చింది. హుండీ కానుకలు, విలువైన నగలు వీటికి అదనం.



కృష్ణమ్మకు హారతి

మోసగించిన వ్యాపారి ఇంటి ముందు రైతుల నిరసన



హరిప్రసాదరావు ఇంటి ముందు బైఠాయించి ఆందోళన చేస్తున్న అన్నదాతలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పత్తి కొనుగోలు చేసి నగదు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న వ్యాపారి ఇంటి ముందు రైతులు నిరసనకు దిగారు. మోసం చేసిన పత్తి వ్యాపారి నుంచి డబ్బు ఇప్పించి తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత పత్తి రైతులు తెలిపిన వివరాలివీ.. గుంటూరులోని చంద్రమౌళీనగర్ ఆరో లైనులో నివాసం ఉంటున్న నేరెళ్ల హరిప్రసాదరావు పత్తి వ్యాపారి. జిల్లాలోని పొన్నెకల్లు, బేజాత్‌పురం, తాళ్ల చెరువు, కొప్పరావూరు తదితర గ్రామాలకు చెందిన వంద మంది రైతులు 2022లో హరిప్రసాదరావుకు పత్తి అమ్మారు. ఇందుకు శెట్టి సుబ్బరావు, మున్నంగి జోజప్ప మధ్యవర్తిత్వం వహించారు. రైతులకు రూ.1.90 కోట్లు వరకు చెల్లించాల్సి ఉంది. రైతులకు డబ్బు చెల్లించకపోగా వారి నుంచి కొనుగోలు చేసిన పత్తిని తనఖా పెట్టి బ్యాంకుల్లో రూ.4 కోట్ల వరకు రుణం పొందారు. రైతులు నగదు కోసం ఫోన్లు చేస్తున్నా సరిగ్గా సమాధానం ఇవ్వకుండా రోజులు వెళ్లబుచ్చుతూ వచ్చారు. ఏళ్లు గడిచిపోతుండటంతో కొంత మంది రైతులు గుంటూరులోని ఆయన ఇంటి వద్దకు వచ్చి ఆదివారం నిరసనకు దిగారు. న్యాయం చేయాలని పట్టుబట్టారు. పట్టాభిపురం పోలీసులు వచ్చి రైతులకు నచ్చజెప్పారు. దీంతో వారు ఆందోళన విరమించి సీఐ వీరేంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. గతంలో ఇచ్చిన చెక్కులు బౌన్సు అయ్యాయని, హరిప్రసాదరావును డబ్బు ఇవ్వమని తాము ప్రాధేయపడుతుంటే 'మీకు దిక్కున్న వారికి చెప్పుకోండి. మాకు రాజకీయంగా పలుకుబడి ఉంది'.. అని బెదిరిస్తున్నాడన్నారు. ఆయనకు ఓ కార్పొరేటర్ అండదండలు ఉన్నాయని రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. పోలీసులు స్పందించి న్యాయం చేయాలని, లేదంటే మాకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నచ్చిన సమయం.. మెచ్చిన భోజనం

గుంటూరులో ఫుడ్ కోర్టుల ఏర్పాటుకు సన్నాహాలు

నగరంలో రెండు చోట్ల నిర్వహణకు చర్యలు

ఈనాడు-అమరావతి

గుంటూరు నగరంలో ఫుడ్ కోర్టుల ఏర్పాటుకు నగరపాలక సంస్థ అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము 2 గంటల దాకా ఆహార ప్రియులు కోరుకున్న ఆహార పదార్థాలు ఒకే చోట లభ్యమయ్యేలా ఏర్పాటు చేస్తున్నారు. నగరానికి సుదూర ప్రాంతాల నుంచి వివిధ పనుల మీద వచ్చిన వారికి రాత్రి 10 గంటల తర్వాత భోజనం, టిఫిన్ హోటళ్లు అందుబాటులో ఉండటం లేదు. రాత్రి పొద్దుపోయే వరకు పనులు, విధుల్లో నిమగ్నమై ఇంటికి వెళ్లి ఆహారం వండుకొని తినలేని వారు సకాలంలో వెళ్తేనే హోటళ్లలో భోజనం దొరుకుతోంది. పుట్టిన రోజులు, వేడుకలు చేసుకొనేవారికి రాత్రి కొంత సమయం వరకే ఆహారం లభ్యమవుతోంది. ఇక అటువంటి సమస్య ఉండదు. అన్నిరకాల ఆహార పదార్థాలు దొరికేలా ఫుడ్ కోర్టులు అందుబాటులోకి రానున్నాయి.

విజయవాడ తరహాలో...

కొన్నేళ్ల నుంచి విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఈట్ స్ట్రీట్ పేరుతో ఫుడ్ కోర్టు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా గుంటూరులోనూ ఏర్పాటు చేయాలని నాలుగేళ్ల కిందట భావించారు. కొవిడ్ ప్రభావంతో కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు గుంటూరులోనూ ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు విజయవాడ వెళ్లి పరిశీలించి వచ్చారు. అధికారులతో ప్రాథమికంగా చర్చించారు. నగరంలో రాత్రి 9 గంటల తర్వాత అన్ని దుకాణాలు మూసివేసి వర్తకులు ఇళ్లకు వెళ్లిపోతారు. ఆ తర్వాత నుంచి ఫుడ్‌కోర్టులు ప్రారంభించి తెల్లవారుజాము 2 గంటల వరకు నిర్వహించేలా అనుమతులు జారీ చేయాలని భావిస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులతోనూ చర్చించి వెంటనే ప్రారంభించాలనే యోచనలో నగరపాలక సంస్థ ఉంది.



ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేయాలనుకుంటున్న బ్రాడీపేట నాలుగో రహదారి

నాలుగేళ్ల కిందటే..

నగరంలో నాలుగేళ్ల కిందట కొవిడ్‌కు ముందు పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్ సెంటర్‌లో సుమారు రెండు నెలలు ఫుడ్ కోర్టు దిగ్విజయంగా సాగింది. అప్పట్లో నగరపాలక అధికారులు, పోలీసుల సహకారంతో కార్యరూపం దాల్చింది. నగరవాసుల నుంచి మంచి ఆదరణ లభించింది. కేవలం తోపుడు బళ్ల వ్యాపారులే కాకుండా పెద్ద హోటళ్ల నిర్వాహకులు కూడా తమ ఉత్పత్తులను విక్రయించారు. లాభదాయకంగా ఉందని వ్యాపారులు చెప్పారు. కొవిడ్‌తో అవి కనుమరుగయ్యాయి. ప్రస్తుతం స్టాళ్లు, దుకాణాలు మళ్లీ ఏర్పాటు చేసుకోడానికి నగరపాలక అవకాశం కల్పించనుంది. వారం రోజుల్లో వాటిని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు.

తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో...

నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో వేర్వేరుగా నిర్వహించాలని సమాలోచనలు చేస్తున్నారు. నగరం మొత్తానికి ఒకే చోట పెడితే దూరాభారం వల్ల కొందరు రాలేని పరిస్థితి నెలకొంటుందని నియోజకవర్గానికి ఒకటి చొప్పున పెట్టబోతున్నారు. ఆయా ప్రాంతాల్లో స్టాల్స్ లేదా తోపుడు బండ్లు పెట్టుకుని ఆహార పదార్థాలు విక్రయించే వ్యాపారుల నుంచి నగరపాలక ఎటువంటి పన్నులు వసూలు చేయదు. వ్యాపారులకు కేవలం వేదిక మాత్రమే చూపించి అక్కడ మాత్రమే వ్యాపారం చేసుకోవాలని సూచిస్తుంది. పశ్చిమ నియోజకవర్గంలో బ్రాడీపేట 4వ రోడ్డు (శంకర విలాస్ రహదారి), తూర్పు నియోజకవర్గంలో కొత్తపేట డాక్టర్స్ ప్లాజా రోడ్‌తో పాటు గుంట గ్రౌండ్ జంక్షన్ రహదారుల్లో ఏదో ఒక చోట పెట్టాలని భావిస్తున్నారు.

పసుపు రైతులకు ▶ కాసులు కురిపించేనా..?

ధర పెరుగుదలపై నిల్వదారుల్లో ఆశ

దుగ్గిరాల, న్యూస్‌టుడే

పసుపు ధరలు నిల్వదారుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. తారాస్థాయికి చేరి మళ్లీ తగ్గడంతో భవిష్యత్తు ఎలా ఉండబోతోందంటూ రైతులు అంచనాలు వేసుకుంటున్నారు. పసుపు వ్యాపారపరంగా రాష్ట్రంలో దుగ్గిరాల, కడప రెండు మార్కెట్లు ఉన్నాయి. వీటిలో దుగ్గిరాల పెద్దది. ఇక్కడ దసరాకు ధర పెరుగుతోందని కొందరు, అప్పటికి కాకున్నా దీపావళికి అయినా ఉంటుందని మరికొందరు స్టాకిస్టులు ఊహాగానాల్లో ఉన్నారు. చాలా వరకూ పసుపు రైతుల దగ్గర నుంచి నిల్వదారుల చెంతకు చేరింది. కొందరు పెద్ద రైతుల వద్ద మాత్రం సరకు అలానే ఉంది.


పసుపులో రాళ్లు ఏరుతున్న మహిళా హమాలీలు (పాత చిత్రం)

4 లక్షల బస్తాల నిల్వ అంచనా

ప్రస్తుతం దుగ్గిరాల యార్డులో 2,500, సెంట్రల్ వేర్‌హౌస్ గోదాముల్లో 57 వేలు, స్థానికంగా ఉన్న శీతల గిడ్డంగిలో 60 వేల బస్తాలు ఉన్నాయి. ఇవి కాక పసుపు దుకాణాల్లో, కొల్లిపర, కొల్లూరు తదితర మండలాల్లో కలిపి రూ.2.5 లక్షల బస్తాలు నిల్వ ఉండవచ్చని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. పైగా ఈ ఏడాది పంట వేశారు. అది మరో ఆరు నెలల్లో అమ్మకానికి వచ్చేస్తోంది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో మరో లక్ష బస్తాల ఉత్పత్తి వస్తుందనేది అంచనా. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 5,000 ఎకరాల్లో పసుపు సాగు అవుతోంది. గత నెలలో వచ్చిన వరదల కారణంగా సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండే కొల్లూరు, భట్టిప్రోలు, కొల్లిపర తదితర ప్రాంతాల్లో సుమారు 500 నుంచి 600 ఎకరాల్లో పంట దెబ్బతింది. దీంతో ఉత్పత్తి కొంత తగ్గుతుందనే అంచనాలూ ఉన్నాయి.

ఎక్కడికక్కడ కల్లాల్లోనే..

దుగ్గిరాల మార్కెట్ యార్డుకు సుమారు 3 లక్షల బస్తాల సరకు అమ్మకానికి వస్తోంది. యార్డులో రెండేళ్ల క్రితం ఈ- నామ్ పెట్టిన తర్వాత రైతులు అంతగా యార్డుకు రావడం లేదు. దీంతో రైతులు ఎక్కడికక్కడ కల్లాల్లోనే అమ్ముకుంటున్నారు. గతంలో ప్రత్యక్ష పద్ధతిలో వేలం ఉండేది. అప్పుడు రైతులకు ధర ఎలా ఉంటోందని తెలిసేది. ఈ-నామ్ వచ్చాక అలా కాదు. వ్యాపారులు సరకును చూసుకుని తమకు నచ్చిన ధరను కంప్యూటర్‌లో పొందుపరుస్తారు. వాటిలో ఎక్కువగా ఏ కొనుగోలుదారు కోట్ చేస్తారో వారికి ఆ సరకు ఇస్తారు.

ధరలు పరిశీలిస్తే...

సాధారణంగా పసుపు సీజన్ మార్చి ఆఖరు నుంచి మొదలవుతోంది. ఏప్రిల్ నుంచి రైతులు సరకును తీసుకొస్తారు. 2023లో గరిష్ఠ ధర క్వింటాలుకు రూ.5 వేలు దాటలేదు. ఏడాది గడిచే సరికి 2010 వచ్చిన ధరల మాదిరిగా ఒక్కసారిగా అనూహ్యంగా పెరిగాయి. అక్కడి నుంచి క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఏప్రిల్ నుంచి ధరలు పరిశీలిస్తే..

నెల	కనిష్ఠ ధర	గరిష్ఠ
	(క్వింటాలుకు రూ.లలో)	
ఏప్రిల్	13,625	15,150
మే	13,000	15,350
జూన్	13,550	14,650
జులై	11,000	13,500
ఆగస్టు	10,600	12,500
సెప్టెంబరు	10,800	12,900
అక్టోబరు	10,311	12,350

ఎగుమతులు తగ్గడమే కారణం

సాధారణంగా ఇక్కడ నుంచి పసుపు అరబ్ దేశాలు, బంగ్లాదేశ్‌కు ఎక్కువగా ఎగుమతి అవుతోంది. ఈ ఏడాది బంగ్లాదేశ్‌లో వచ్చిన సంక్షోభం కారణంగా ఎగుమతులు తగ్గాయని వ్యాపారి గూడూరు వెంకట్రావ్ తెలిపారు. ఈ ప్రభావం ధరలపై పడిందని వ్యాపార వర్గాల అభిప్రాయం. అక్కడ పరిస్థితులు మెరుగుపడితే కొంత సానుకూలత ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు జిల్లాలో పండే పసుపులో కడప, టేకూరుపేట రకాలు ఎక్కువగా ఉంటున్నాయి. వీటిలో నాణ్యతను పెంచే కుర్కుమిన్ శాతం తక్కువగా ఉంటోందని రైతులు అంటున్నారు. అదే నిజామాబాద్, మహారాష్ట్రంలో సాంగ్లీ, తమిళనాడులోని ఈరోడ్ లో ఎక్కువ కుర్కుమిన్ శాతం ఉండే రకాలు ఉత్పత్తి చేస్తున్నారని చెబుతున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సేవలు

పెమ్మసాని చొరవతో జీడీఎస్ సిబ్బందికి పోస్టల్ శాఖలో ఉద్యోగాలు

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సేవలందిస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు, పులివెందుల, హైదరాబాద్‌కు చెందిన పోస్టల్ ఉద్యోగులు ఆదివారం ఆయన్ని గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. మీరు పట్టించుకోవడం వల్లే ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉన్న నియామకాలు దక్కాయని ఉద్యోగులు పెమ్మసానికి ధన్యవాదాలు తెలియజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 'గ్రామీణ డాక్ సేవల్లో తాత్కాలిక ఉద్యోగులుగా పని చేస్తున్న మమ్మల్ని గతంలో పోస్టల్ శాఖలో శాశ్వత ఉద్యోగ నియామకాల నిమిత్తం గతంలో ఆ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల నుంచి 3,500 మంది ఏడాది క్రితం పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించారు. పలు సాంకేతిక కారణాల వల్ల ఏడాదిన్నరగా నియామకాలు ఇవ్వని విషయాన్ని గత నెలలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి దిల్లీలోని పోస్టల్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు.. మూడు వారాల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఇటీవలే మాకు పోస్టల్ శాఖ నియామక ఆదేశాలు జారీ చేసింది. పెమ్మసాని స్పందించడం వల్లే మాకు న్యాయం జరిగింది..' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందన్నారు. సమస్యల్ని తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తొలి దశలో 1,200 మందికి నియామకాలు జారీ చేసిన పోస్టల్ శాఖ.. త్వరలో మిగిలిన అభ్యర్థులకు కూడా నియామకాలు జారీ చేస్తుందన్నారు.


కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాపరిషత్తు (గుంటూరు): రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నందున, వాటి అమలుకు సిబ్బంది కృషి చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.వి.విజయలక్ష్మి అన్నారు. ఉపాధి పథకం విజిలెన్స్ విభాగం జిల్లా అధికారిగా పని చేస్తున్న ఆమెను డీఆర్‌డీఏ పీడీగా ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసింది. దాంతో ఇప్పటి వరకు పనిచేసిన పీడీ వై.హరిహరనాథ్ విధుల నుంచి శనివారం రిలీవ్ కాగా విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. డీఆర్‌డీఏ- వెలుగు కార్యాలయ విభాగాల ఏపీఎంలు, డీపీఎంలు, ఏపీఎంలు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. బదిలీ అయిన పీడీ హరిహరనాథ్‌ను అభినందన వీడ్కోలు సభ నిర్వహించారు.

మద్యం దుకాణాలకు 618 దరఖాస్తులు

49 చోట్ల ఒక్కరూ రాలేదు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జోన్ పరిధిలోని గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 256 మద్యం దుకాణాలకు ఆదివారం వరకు 618 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ ఉప కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ శాఖ జిల్లా సహాయ కమిషనర్ (ఏసీ) రవికుమార్‌రెడ్డి, గుంటూరు ఈఎస్ అరుణకుమారితో కలిసి ఆయన మాట్లాడారు. గుంటూరు జిల్లాలో 127 దుకాణాలకు గాను ఇప్పటివరకు 112 చోట్ల 394 దరఖాస్తులు వచ్చాయి. 15 దుకాణాలకు ఒక్క దరఖాస్తూ రాలేదు. పల్నాడు జిల్లాలో 129 దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేయగా 92 చోట్ల 224 దరఖాస్తులు వచ్చాయి. 37 చోట్ల ఒక్క దరఖాస్తూ రాలేదని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా దరఖాస్తులను సులువుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లలోనూ దరఖాస్తులు స్వీకరిస్తారని చెప్పారు. ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణ ఉంటుంది. ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా, ఎన్ని దరఖాస్తులైనా దాఖలు చేసుకోవచ్చునని చెప్పారు. ఈ నెల 11వ తేదీన వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో దుకాణాల ఎంపిక జరుగుతుందని డీసీ చెప్పారు.


వివరాలు తెలుపుతున్న డీసీ శ్రీనివాసులు, ఈఎస్ అరుణకుమారి, ఏసీ రవికుమార్‌రెడ్డి

సీఎం సహకారంతో నిధులు మంజూరు చేస్తాం

కాకుమాను, న్యూస్‌టుడే : ప్రత్తిపాడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయాలంటే సుమారు రూ. 1100 కోట్లు అవసరం అవుతాయని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కాకుమానులో ఆదివారం జరిగిన తెదేపా నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నల్లవడ వాగు, గుంటూరు ఛానల్, అప్పాపురం ఛానల్ లాంటి కాల్వల పనులకు నిధులు కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. తొలుత రూ.150 కోట్లు కేటాయించి కాల్వలకు సంబంధించిన పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి పార్లమెంటు పరిధిలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో తన సొంత నిధులతో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ పెమ్మసాని చొరవతో కాకుమాను మండలంలో రూ.5.62 కోట్లు నిధులు రహదారి పనులకు కేటాయించారన్నారు. నియోజకవర్గంలో కొంత మందికి ఇంకా వైకాపా వాసన పోలేదని... అలాంటి వారు పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతి నియోజకవర్గంలో తన సొంత నిధులతో పాఠశాలను ఏర్పాటు చేస్తానని పెమ్మసాని చెప్పారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, తెదేపా నాయకులు సునీల్ చౌదరి, వీరయ్య చౌదరి, అగస్టిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన ఎమ్మెల్యే రామాంజనేయులు తదితరులు

ఉద్యోగాల కల్పన చంద్రబాబుకే సాధ్యం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఉద్యోగ మేళాకు అనూహ్య స్పందన లభించిందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉద్యోగ మేళా నిర్వహించారు. దీనిని ఎమ్మెల్యే మాధవి ప్రారంభించారు. నిరుద్యోగుల నుంచి ఎమ్మెల్యే మాధవితో పాటు పలువురు తెదేపా నాయకులు, వివిధ సంస్థల ప్రతినిధులు వివరాలను నమోదు చేసుకున్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ 'ఉద్యోగ మేళాకు 2000 మంది ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేసుకోగా.. మరో 2000 మంది నేరుగా హాజరయ్యారు. టెక్ మహీంద్ర, అమర్‌రాజా, ఈసీపీఎల్, యాక్సిస్ బ్యాంక్, టాటా, రిలయన్స్, ఎంఆర్ఎఫ్ టైర్స్, హీరో, డైకిన్, ఎయిర్‌టెల్, ఫోన్ పే మొదలగు 42 సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇంత మంది వచ్చారంటే ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉన్న నమ్మకమే. ఉద్యోగాల కల్పన చంద్రబాబుకే సాధ్యం. 1200 మందికి నియామక పత్రాలు అందజేశాం. రూ.18000 నుంచి రూ.40,000 వేతనం లభించే ఉద్యోగాలు యువతకు లభించాయి. అక్టోబర్‌లో ఉద్యోగ మేళా నిర్వహించి మరో 800 మందికి ఉద్యోగాలు వచ్చేలా చూస్తాం. గుంటూరు పశ్చిమను నిరుద్యోగ రహిత నియోజకవర్గంగా చూడాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. భవిష్యత్తులో ఇటువంటి మెగా ఉద్యోగ మేళాలు మరిన్ని నిర్వహిస్తాం'.. అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల కార్యదర్శి విష్ణువర్ధన్, పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందుకున్న యువతతో పశ్చిమ ఎమ్మెల్యే మాధవి

ఏకలవ్య ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక

గాంధీనగర్, న్యూస్‌టుడే : ఏకలవ్య గ్లోబల్ ఫెడరేషన్ నూతన కమిటీని ఆదివారం ప్రెస్ క్లబ్‌లో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కండెల ఆంజనేయరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేడ రమేష్, ఉపాధ్యక్షుడిగా మొగలి అద్దయ్య, ప్రధాన కార్యదర్శిగా జగన్నాథ బాబూరావు, సహాయ కార్యదర్శిగా దేవర వెంకటేశ్వర్లు, కోశాధికారిగా భారతి ఎన్నికయ్యారు. అలాగే కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా కె.నాగవెంకన్న, గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా కుంభ ఏడుకొండలు నియమితులయ్యారు.

ఇంజినీరింగ్ చదివి.. దొంగగా మారి..

నిందితుడి అరెస్టు.. రూ.10 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: మెకానికల్ ఇంజినీరింగ్ చదివిన ఒక యువకుడు జూదం, హార్స్ రైడింగ్, క్రికెట్ బెట్టింగ్ వంటి దురలవాట్లకు బానిసయ్యాడు. ప్రయివేటు ఉద్యోగాలతో వచ్చే సంపాదన జల్సాలకు సరిపోకపోవడంతో దొంగ అవతారమెత్తాడు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డాడు. ఇటీవల గుంటూరు ఎస్వీఎన్ కాలనీలో పట్టపగలే భారీ ఎత్తున బంగారు ఆభరణాలు అపహరించి కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బావ ఇంట్లో దాచి పెట్టాడు. ఆ దొంగను గుంటూరు పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలు పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు ఆదివారం మీడియాకు వెల్లడించారు.

తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గొర్రెల చినబాబు 2015లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. అప్పట్లో మెడికల్ రిప్రజంటేటివ్‌గా పని చేశాడు. ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. క్రికెట్ బెట్టింగ్, హార్స్ రైడింగ్, జూదం వంటి దురలవాట్లకు బానిసవడంతో భార్యతో విభేదాలొచ్చాయి. జల్సాలు చేసేందుకు డబ్బు సరిపోకపోవడంతో 2019 నుంచి దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడటంతో పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈవిధంగా పలు స్టేషన్లలో 30 వరకు కేసులున్నాయి. జైలులో పరిచయమైన నాగ్‌పూర్‌కు చెందిన శామ్యూల్‌రాజుతో కలిసి గత నెల 21న ఎస్వీఎన్ కాలనీలోని మద్దు వెంకటేశ్వరరావు ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. చోరీ సొత్తుతో పరారై కాకినాడ ఏపీఎస్‌బీ మూడో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బావ వినోద్ ఇంట్లో దాచి పెట్టినా సోదరి, బావకు తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పట్టాభిపురం సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా ఆచూకీ కనుగొన్న పోలీసులు చివరకు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద అరెస్టు చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్ పర్యవేక్షణలో సీసీఎస్ డీఎస్పీ శివాజీరాజు, వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్, సీసీఎస్ సీఐ అల్తాఫ్ హుస్సేన్, సీఐ వీరేంద్రబాబు తదితర సిబ్బంది దొంగను అరెస్టు చేసి రూ.10 లక్షల విలువైన 306 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మరో దొంగ శామ్యూల్‌రాజును గత నెల 28న హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. త్వరలో అతడిని కూడా పట్టుకొచ్చి విచారించి సొత్తు రికవరీ చేస్తామని సీఐ వీరేంద్రబాబు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబర్చిన సీసీఎస్ సీఐ అల్తాఫ్ హుస్సేన్, సీఐ వీరేంద్రబాబు, సీసీఎస్ సిబ్బంది రామకృష్ణ, పీటర్ రాజు, రవి, రమేష్‌బాబు, ఆదినారాయణ, వీరయ్య, పట్టాభిపురం ఎస్ఐ మధుపవన్, కానిస్టేబుల్ ప్రసాదరావులను ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించి రివార్డులు ప్రకటించారు.


దొంగను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీరేంద్రబాబు

నేటి నుంచి జాతీయ స్థాయి నాటికల పోటీలు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: కళలకు నిలయమైన తెనాలిలో సామాజిక అంశాలను ఇతివృత్తంగా రూపొందించిన రంగస్థల పద్య, సాంఘిక జాతీయ స్థాయి నాటక, నాటిక పోటీలు ఈనెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు తెనాలి రామకృష్ణ కవి కళా క్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు కళల కాణాచి తెనాలి వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ తెలిపారు. ఆయన ఆదివారం తెనాలిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాటకోత్సవాలతో పాటు వీణా పురస్కారాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 8న ఎ.ఆర్.కృష్ణ, 12న బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాల ప్రదానం ఉంటుందని తెలిపారు. తొలిరోజు పేరొందిన రంగస్థల కళాకారులు దివంగత వల్లూరు వెంకట్రామయ్య చౌదరి, కన్నెగంటి నాసరయ్య, కొడాలి గోపాలరావు, బెల్లంకొండ రామదాసు శతజయంతి సదస్సు సందర్భంగా వారి పేరున ఆచంట బాలజీనాయుడు, జరుగుల రామారావు, వల్లూరు శివప్రసాద్, జమ్మల మడక శశిమోహన్‌కు పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఇదే రోజు శ్రీకృష్ణరాయబారం పద్యనాటిక ప్రదర్శన ఉంటుందని, చివరి రోజు విజేతలకు బహుమతి ప్రదాన సభ ఉంటుందన్నారు.


మాట్లాడుతున్న సినీ మాటల రచయిత సాయిమాధవ్ తదితరులు

ఫైనల్ రౌండ్‌కు రాష్ట్ర షట్లర్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని సీహెచ్ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియం, ఎస్ఎస్‌బీఏ ఇండోర్ స్టేడియాల్లో జరుగుతున్న ఆలిండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో పలువురు రాష్ట్ర షట్లర్లు క్వాలిఫైయింగ్ ఫైనల్ రౌండ్‌లో ప్రవేశించారు. ఆదివారం జరిగిన పోటీల్లో అండర్-17 బాలుర సింగిల్స్‌లో డి.శేఖర్‌శతమన్యు(కృష్ణా), హరికృష్ణ వీరంరెడ్డి, బాలికల సింగిల్స్‌లో ఆర్.లక్ష్మీసాయి ఆరాధ్య (గుంటూరు), ఆర్.స్ఫూర్తిలు ఫైనల్ రౌండ్‌లో ప్రవేశించారు.

నాలుగు కేజీల గంజాయి స్వాధీనం

పెదకాకాని, న్యూస్‌టుడే: యువతకు గంజాయి రవాణా చేస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని నంబూరుకు చెందిన ప్రైవేటు ఉద్యోగి వాసా రాజేష్, ట్రాక్టర్ డ్రైవర్ తాడిబోయిన గోపి కృష్ణ, కూల్‌డ్రింక్ దుకాణం నిర్వాహకుడు దుర్గపు పవన్‌కుమార్ స్నేహితులు. ఈ ముగ్గురు జల్సాలకు అలవాటు పడి గంజాయి తెప్పించి విక్రయిస్తున్నారు. వీరికి గంజాయి వ్యాపారం చేసే అనగాని రాఘవేంద్ర (కృష్ణా జిల్లా ఉయ్యూరు), తాతా హేమంత్ (ఏలూరు జిల్లా నూజివీడు), విజయవాడ పడమటకు చెందిన పండాలనేని వెంకట శివ గణేశ్‌కుమార్, ప్రతివాడ శివాజీ తోడయ్యారు. ఈ నెల 5వ తేదీ రాత్రి ఈ నలుగురు గంజాయి తీసుకొచ్చి నంబూరులోని ఓ కాలనీ వద్ద ఉన్న రాజేష్, గోపికృష్ణ, పవన్‌కుమార్‌లకు ఇచ్చారు. అందరూ కలిసి గంజాయిని చిన్న పొట్లాలుగా ప్యాకింగ్ చేస్తున్నారు. అదే సమయంలో పెదకాకాని సీఐ నారాయణస్వామి, కానిస్టేబుళ్లు దాడి చేసి ఈ ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు కేజీల గంజాయి (విలువ రూ.60వేలు), మూడు ద్విచక్ర వాహనాలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ కృష్ణకాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితులను ఆదివారం రిమాండ్‌కి పంపినట్లు సీఐ తెలిపారు.

ఏపీ హెల్త్ ఎడ్యుకేటర్స్ సంక్షేమ సంఘ ఎన్నిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ స్టేట్ హెల్త్ ఎడ్యుకేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నెల్లూరులోని ధనలక్ష్మీపురం కల్పనా రెసిడెన్సీ సమావేశ మందిరంలో ఆదివారం జరిగింది. సుదీర్ఘ చర్చల అనంతరం రాష్ట్ర నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షునిగా కర్నూలు జిల్లాకు చెందిన డబ్ల్యూ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా చేజర్ల సుధాకర్ రావు(నెల్లూరు), గౌరవ అధ్యక్షునిగా భానుమూర్తి(గుంటూరు), కోశాధికారిగా ఎన్.హరిప్రసాద్(నెల్లూరు), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా టి.జయప్రకాశ్(కడప), రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎస్‌డీ బేగం(విశాఖపట్నం) ఎన్నికయ్యారు.

విద్యుత్తు సంస్థలో నోడల్ అధికారులు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: కేంద్ర విద్యుత్తు పంపిణీ సంస్థ పరిధిలో నూతనంగా నోడల్ అధికారులను నియమిస్తూ ఆ సంస్థ సీఎండీ పి.రవి ఈనెల 4న ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ, మచిలీపట్నం సర్కిళ్లకు మాచర్ల ఈఈ ఎం.భాస్కరరావును నియమించారు. తెనాలి ఈఈ టి.వి.తులసీరామ్‌ను సీఆర్‌డీఏ, బాపట్ల సర్కిళ్లకు, బాపట్ల ఈఈ(కన్‌స్ట్రక్షన్) సింగయ్యను గుంటూరు, పల్నాడు సర్కిళ్లకు, బాపట్ల ఈఈ కరీమ్‌ను ఒంగోలు సర్కిల్‌కు కేటాయించారు. కొత్త సర్కిళ్లను ప్రారంభించినందున ప్రభుత్వ పథకాలు అమలుకు నోడల్ అధికారులను నియమించినట్లు ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. సాధారణ బదిలీల్లో మచిలీపట్నంలో పని చేస్తున్న భాస్కరరావును మాచర్లకు మార్చారు. ఆయన అక్కడ చేరలేదు. దీంతో నరసరావుపేట ఈఈ రాంబొట్లును మాచర్ల ఈఈగా ఇన్‌ఛార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఆర్‌డీఏ ఈఈ తులసీరామ్‌ను తెనాలికి మార్చగా వెంటనే విధుల్లో చేరారు. అక్కడ పని చేస్తున్న చిరంజీవిని బాపట్ల ఈఈ(ఎంఆర్‌టీ)గా మార్చారు. తాజా ఆదేశాల్లో ఈఈ ఎంఆర్‌టీతో పాటు తెనాలి ఈఈ ఇన్‌ఛార్జిగా నియమించారు. ఒంగోలు ఈఈ కన్‌స్ట్రక్షన్‌గా పని చేస్తున్న టి.శ్రీనివాసరావును ఈఈ కన్‌స్ట్రక్షన్ బాపట్ల ఇన్‌ఛార్జిగా కేటాయించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

తెనాలి

•తెనాలి •పొన్నూరు



ప్రమాదకరంగా తాగు నీటి ట్యాంక్

తెనాలి మండలం ఖాజీపేటలోని తాగు నీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. పై భాగంలో నీటి నిల్వ ట్యాంకుతో పాటు పిల్లర్లు సైతం బలహీనంగా మారి ఏ క్షణంలోనైనా కూలిపోతుందోమేనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అబ్దుల్ మతీన్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకం కింద నూతన ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపి ఉన్నామని, త్వరలో నూతన నిర్మాణం చేస్తామన్నారు.

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

పొన్నూరు, న్యూస్‌టుడే: మండల పరిధి దొప్పలపూడిలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు నిత్యావసర వస్తువులు, దుస్తులు, వంట పాత్రలను రోటరీ సర్వీసు సొసైటీ అధ్యక్షుడు బోడపాటి రామారావు, బండారుపల్లి శ్రీనివాసరావు,మేగనాథ్ అందజేశారు.

20న ధార్మిక శిక్షణ తరగతులు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణపై ధార్మిక సభ్యులకు అవగాహన కల్పించడానికి తెనాలి సబ్ డివిజన్ గ్రామ ధార్మిక సమితి కన్వీనర్ల శిక్షణ తరగతులు ఈనెల 20వ తేదీ నుంచి తెనాలిలో నిర్వహించనున్నట్లు జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక గోవర్ధనస్వామి ఆలయంలో మాట్లాడారు. 12న సత్సంగం, 16, 17 తేదీల్లో పౌర్ణమి హారతులు, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

కాలనీ సమస్యలపై తీర్మానం

తెనాలి (కొత్తపేట): అంతర్గత రోడ్ల మరమ్మతులు, డ్రెయిన్ల నిర్మాణం, తాగునీటి పైపులైన్ల ఏర్పాటు పనులు, జిల్లా ఆసుపత్రికి ఆర్టీసీ బస్సు సౌకర్యం, ఇళ్ల విద్యుత్తు ఛార్జీలు, ఆస్తి పన్ను తగ్గింపు, ఆక్రమణలు తొలగింపు సమస్యలపై సమావేశంలో ప్రవేశ పెట్టిన తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. స్థానిక అమరావతి కాలనీ గృహ యజమానుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం కాలనీలోని కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. అధ్యక్షుడు గుమ్మడి నారాయణ, వార్డు కౌన్సిలర్ జయపాల్, డాక్టర్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

తపాలా సొసైటీ సేవలు అభినందనీయం



వేదికపై సన్మానగ్రహీత, విద్యార్థులు, నిర్వాహకులు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: స్థానిక తపాలా, టెలికం సొసైటీ 6 దశాబ్దాలుగా సభ్యులకు సేవలందించడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశంలో విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సత్కరించి నగదు పురస్కారం, జ్ఞాపికలు అందజేశారు. ప్రతిభావంతులైన సొసైటీ సభ్యుల పిల్లలు, పేద విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రతినిధి అంబటి నాగయ్య, సొసైటీ మాజీ కార్యదర్శి ఐ.కోటేశ్వరరావు, బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీఈ ఎన్.మదన్‌మోహన్‌రావు, మాజీ అధికారి ఎం.తిరుమలరావు, దేవిశెట్టి శివ నాగేశ్వరరావు ప్రసంగించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, భాగ్యరాజ్, కోశాధికారి పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్ష విలీనం.. పుర ప్రజలకు నష్టం

పొన్నూరు మున్సిపాలిటీకి 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిపివేత ☛ వైకాపా హయాంలో నిర్ణయ లోపం

పొన్నూరు, న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వ వైఫల్యం వల్ల 15వ ఆర్థిక సంఘం ఈ ఏడాది మొదటి విడత నిధులు పొన్నూరు పురపాలక సంఘానికి మంజూరు కాకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించని పురపాలక సంఘాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. 2019లో వైకాపా ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తరవాత పొన్నూరు పురపాలక సంఘంలోకి చింతలపూడి, వడ్డిముక్కల, అలూరు, కట్టెంపూడి, చినమిడింపాడు గ్రామాలను విలీనం చేసింది. స్థానికులు అభ్యంతరాలు చెప్పినప్పటికీ అప్పటి పాలకులు, అధికారులు వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ముందుకు వెళ్లారు.



భావనగర్ కాలనీలో ముందుకు కదలని మురుగు

అంతా మా ఇష్టం..

వైకాపా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించిన స్థానికులు హైకోర్టును ఆశ్రయించడంతో విలీన ప్రక్రియ నిలిచిపోయింది. పొన్నూరు పురపాలక సంఘానికి ఎన్నికలు జరగలేదు. ఐదు సంవత్సరాలు నుంచి ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగింది. కేంద్ర ఆర్థిక సంఘం నిధులపై ఆధారపడి పట్టణంలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపడతారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో సిమెంటు రహదారులు, సిమెంటు మురుగు కాలువలు, తాగునీటి పైపులైను, పార్కుల్లో వసతుల కల్పనకు తదితర పనులకు ఖర్చు చేసుకోవచ్చని ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు. పొన్నూరు మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించకపోవడంతో పురపాలక సంఘానికి ఈ ఏడాది మొదటి విడత అందాల్సిన ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.1.30 కోట్ల జమ కాలేదు. ఎన్నికలు జరిగి ఉంటే నిధులు మంజూరు చేసేవారని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఖర్చు చేసే వెసలుబాటు ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

● పురపాలక సంఘం డీఈ ఏడుకొండలును న్యూస్‌టుడే వివరణ కోరగా పొన్నూరు పురపాలక సంఘానికి ఎన్నికలు జరగకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు జమ కాలేదని వెల్లడించారు.

పొన్నూరు పట్టణంలో

వార్డులు : 31, కుటుంబాలు : 18,005
జనాభా : 61,500
కచ్చా మురుగు కాలువలు : 60 కిలో మీటర్లు
కచ్చా రహదారులు : 50 కిలో మీటర్లు



విద్యానగర్‌లో అధ్వానంగా రహదారి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణ పరిధి 29వ వార్డులో రహదారులు అనుసంధానం కాకపోవడంతో రాకపోకలు నిర్వహించడం చాలా ఇబ్బందికరంగా మారింది. తగు చర్యలు తీసుకోవాలి. -షేక్ కరిముల్లా

✔ రహదారి అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటా. - అపర్ణ, సహాయ ఇంజినీర్

? పట్టణంలోని షరాఫ్‌బజార్‌లో మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి దుర్వాసన వస్తోంది. - షేక్ బుడే, షరాఫ్ బజార్


✔ వ్యర్థాలను తొలగించేలా తగు చర్యలు తీసుకుంటా. - శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి

- న్యూస్‌టుడే, పొన్నూరు

స్పందనకు వందనం

మేమున్నాం...మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి ప్రజారోగ్యశాఖాధికారులు స్పందించారు. షరాఫ్‌బజార్‌లోని మురుగు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. - న్యూస్‌టుడే, పొన్నూరు

గుదిబండి వెంకటరెడ్డికి నివాళి



విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

కొల్లిపర, న్యూస్‌టుడే: ప్రజల హృదయాల్లో మాజీ ఎమ్మెల్యే, దివంగత గుదిబండి వెంకటరెడ్డి చెరగని ముద్రవేశారని పలువురు వక్తలు కొనియాడారు. గుదిబండి వర్ధంతిని పురస్కరించుకుని కొల్లిపర గ్రామ కూడలి, గుదిబండివారిపాలెం గ్రామాల్లోని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. దుగ్గిరాల నియోజకవర్గం నుంచి ఆయన వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందరని, ఆయన చేపట్టిన అభివృద్ధి పనులు మనముందున్నాయని ప్రశంసించారు. కార్యక్రమంలో కొల్లిపర మాజీ ఉప సర్పంచి గుదిబండి కృష్ణారెడ్డి, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు మునగాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలి



బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ, నాయకులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: దేశానికి సుదీర్ఘకాలం సేవలందించిన నేత బాబు జగ్జీవన్‌రామ్ అని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. తెనాలి చినరావూరులో ఆదివారం రాత్రి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ, అంబేడ్కర్‌లతో కలిసి జగ్జీవన్‌రామ్ దేశం కోసం పని చేశారని, అయినా వారివురి స్థాయి గుర్తింపు రాలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో ఆయనకు భారతరత్న రాలేదు, ప్రస్తుత ప్రధాని మోదీ హయంలోనైనా వస్తుందేమో చూడాలన్నారు. దళిత క్రిస్టియన్‌లకు మతం మారితే రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరుగుతుంది, భవిష్యత్తులో దీనిపై ప్రశ్నిస్తానన్నారు. తాను ఏ రాజకీయ పార్టీలోకి వెళ్లనని, జాతి ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. పలువురు నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు, న్యూస్‌టుడే: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకువాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. స్థానిక రోడ్డు భవనాల శాఖ అతిథి గృహంలో ఆదివారం రెవెన్యూ, పోలీసు అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో రేషన్ బియ్యం మాఫియాకు అడ్డుకట్ట వేసేందకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఏడాది జులైలో చేబ్రోలుకు చెందిన 13 సంవత్సరాల బాలికను హత్య చేసిన నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నామని, త్వరగా నిందితుడిని పట్టుకునే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. హత్యకు గురైన బాలిక కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు. నియోజకవర్గంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని కోరామని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రధాన మార్గాల్లో సీసీ కెమెరాలను దాతల సాయంతో ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మంచి అలవాట్లు, ప్రణాళిక ఎంతో అవసరం



ప్రసంగిస్తున్న విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం.ఎస్.రఘునాథన్

పొన్నూరు: విద్యార్థులు విద్యలో రాణించాలంటే మంచి అలవాట్లు, చక్కని ప్రణాళిక ఎంతో అవసరమని విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం.ఎస్.రఘునాథన్ పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఫ్రెషర్స్ డే వేడుకలను వైభవంగా నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ భాగస్వాములు కావాలని కోరారు. రోజూ వ్యాయమం చేయాలని సూచించారు. విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతోగానో అకట్టుకున్నాయి. లారా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.ఫణింద్రకుమార్ పాల్గొన్నారు.

మాలలను నిర్లక్ష్యం చేస్తే సహించం

పొన్నూరు, న్యూస్‌టుడే: మాలలను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వాలకు బుద్ధి చెబుతామని మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగల చైతన్య అన్నారు. పొన్నూరులో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకంగా గ్రామ స్థాయి నుంచి ఉద్యమం తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీలు ఉదమ్యం చేపట్టాల్సిన సమయం ఆసన్నమైందనే విషయాన్ని గుర్తించుకుని ప్రతి దళితుడు ముందుకు రావాలని కోరారు.

శివ శంకరీ.. జగజ్జననీ..



మారీసుపేట: మహాదుర్గారూపంలో



గంగానమ్మపేట: ఎండు ఫలాలతో అన్నపూర్ణదేవి



తక్కెళ్లపాడులో..



బోసురోడ్డు: కన్యకా పరమేశ్వరి ఆలయంలో..



శలపాడులో శాకంబరిగా..

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఆదివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లోని జగన్మాత ఆలయాలు భక్తుల సందడితో నిండాయి. కాత్యాయని, మహాదుర్గాదేవి, అన్నపూర్ణాదేవి, సంతానలక్ష్మి, గాయత్రీదేవి తదితర అలంకారాల్లో ఆదిశక్తి భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ దేవాలయాల్లో కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు విశేష పూజలు నిర్వహించి వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

-న్యూస్‌టుడే, బృందం



పాండురంగపేట: పోలేరమ్మగుడిలో పూజ చేస్తున్న ట్రాన్స్‌జెండర్లు, దాత వెంకటేశ్వరరావు



నిడుబ్రోలులో గాయత్రీదేవి



నాగరాజుపాలెంలో..



నంబూరు: దశావతార వెంకన్న సన్నిధిలో..



తూములూరులో లలితాదేవి




పొన్నూరు కన్యకా పరమేశ్వరి ఆలయంలో

వైకాపా మాజీ కౌన్సిలర్ జనసేనలో చేరిక



విజయరాణికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాదెండ్ల మనోహర్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వైకాపా మాజీ మున్సిపల్ కౌన్సిలర్, తెనాలి చేనేత సంఘ మాజీ అధ్యక్షురాలు దామర్ల విజయరాణి ఆదివారం జనసేన పార్టీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయరాణి మాట్లాడుతూ తన భర్త దివంగత దామర్ల వీరాంజనేయులు గతంలో నాదెండ్ల మనోహర్‌కు ముఖ్య అనుచరులుగా ఉండే వారని, సంఘీయులకు, సంఘానికి ఉపయోగపడే అనేక పనులు ఆయన చేసిపెట్టారని, ఇప్పుడు పార్టీలో చేరిన తర్వాత సొంత ఇంటికి వచ్చినట్లు ఉందన్నారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ పద్మశాలి, చేనేత విభాగాల సమస్యల పరిష్కారం కోసం వీరాంజనేయులు, ఆయన కుటుంబ సభ్యులు విశేష కృషి చేశారని, విజయరాణి జనసేనలో చేరటం చాలా సంతోషంగా ఉందన్నారు.



చెక్కును మంత్రి మనోహర్‌కు అందజేస్తున్న ఎలైట్ బృంద సభ్యులు

ఓపెన్ జిమ్ పరికరాలు ప్రారంభం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణంలోని సత్యనారాయణ పార్కులో మూలన పడిన పరికరాల, సివిల్ పనుల మరమ్మతులను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేసి సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించాలని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. స్థానిక సత్యనారాయణ పార్కులో ఆదివారం దాత కొత్తమాసు కుమార్ ఏర్పాటు చేసిన రూ.6 లక్షల విలువైన ఓపెన్ జిమ్ పరికరాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతను మంత్రి అభినందించారు. పట్టణానికి చెందిన ఎలైట్ బృంద సభ్యులు వరద బాధితుల సహాయార్థం రూ.1.41 లక్షల చెక్కును మంత్రికి అందజేశారు.

రైలు పట్టాలపై మృతదేహం

చేబ్రోలు: సంగం జాగర్లమూడి రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి (30) మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. అతను పసుపు, నలుపు రంగు చొక్కా ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని గుంటూరు శవాగారానికి తరలించామని రైల్వే సీఐ అంజిబాబు తెలిపారు.

రైలు నుంచి పడి..

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: తెనాలికి చెందిన శ్రీనివాసరావు(53) చెన్నైలో పనిమీద కాకినాడ నుంచి చెన్నైకి వెళ్లే సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైల్లో శనివారం సాయంత్రం ప్రయాణించారు. ఫుట్‌బోర్డుపై నిలుచుకుని ఉండడంతో తమిళనాడు రాష్ట్రం గుమ్మిడిపూండి సమీపం పెద్దికుప్పం వద్ద అదుపు తప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొరుక్కుపేట రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మండలంలోని అంగలకుదురు శివారులోని నిమ్మతోటలో గుర్తు తెలియని సుమారు 30 సంవత్సరాల వయసు ఉన్న యువకుడు నైలాన్ తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెనాలి గ్రామీణ పోలీసులు ఆదివారం తెలిపారు. మృతదేహ తీరును అనుసరించి అతను శనివారమే ఆత్మహత్య చేసుకున్నాడని భావిస్తున్నామని, ఇతర రాష్ట్రాలకు చెందిన యువకుడిగా ఉన్నాడని, దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

దారి దోపిడీ కేసులో పాత నేరస్థుల అరెస్టు

వేటపాలెం, న్యూస్‌టుడే: దారి దోపిడీ కేసులో నలుగురు పాత నేరస్థులను పోలీసులు అరెస్ట్ చేయగా మరొకరు పరారీలో ఉన్నారు. వీరి నుంచి ద్విచక్ర వాహనాలు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ జగదీష్ నాయక్ స్థానిక పోలీసు స్టేషనులో ఆదివారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గతనెల 30న నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడుకి చెందిన పెదపూడి షాలెం రాజు తన తల్లిని చీరాల రైల్వేస్టేషను నుంచి తీసుకొచ్చేందుకు ప్లాటినం ద్విచక్ర వాహనంపై తెల్లవారుజామున బయలుదేరి, పందిళ్లపల్లి ఎర్ర గేటు దాటిన తరువాత మూత్రవిసర్జనకు ఆగారు. ఈ సమయంలో అయిదుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చి, రాజును ఇనుపరాడ్‌తో బెదిరించి అతని వాహనంతో పాటు చరవాణిని తస్కరించుకెళ్లారు. ఈ కేసులో పొన్నూరుకు చెందిన షేక్ మదార్ ఉరఫ్ హనీ మిగిలిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. అయిదు ద్విచక్రవాహనాలు, 22 సెల్ ఫోన్లు, నగదు రూ.2,200 కలిసి రూ.4.13లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

జూదరుల అరెస్టు

కొల్లిపర, న్యూస్‌టుడే: మున్నంగి పరిసరప్రాంతాల్లో జూదం ఆడుతున్నట్టు తొమ్మిది మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు కొల్లిపర ఎస్సై పి.కోటేశ్వరరావు తెలిపారు. నిందితుల నుంచి రూ.15,150 నగదు జప్తుచేశామని పేర్కొన్నారు. దాడుల్లో ఏఎస్సై పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో యువకుడి గల్లంతు



నరేష్ (పాతచిత్రం)


కొల్లూరు, న్యూస్‌టుడే: తెనాలి బీసీ కాలనీకి చెందిన బొట్టపాటి నరేష్ (20) ఆరుగురు మిత్రులతో కలిసి ఆదివారం విహారయాత్రకు ద్విచక్రవాహనాలపై బయలుదేరి బాపట్ల జిల్లా చిలుమూరు సమీపంలోని కృష్ణానది వద్దకు చేరుకున్నారు. వీరంతా సరదాగా ఈతలు వేసేందుకు నదిలోకి దిగారు. నరేష్ మరో ఇద్దరు మిత్రులతో కలిసి నీటిలో బంతితో ఆడుకోవడం ప్రారంభించారు. ఈ క్రమంలో నీటి ప్రవాహంలో కొట్టుకు పోతున్న బంతిని తీసుకు వచ్చే ప్రయత్నంలో నరేష్ గల్లంతయ్యాడు. అతడిని రక్షించేందుకు ప్రయత్నించిన ఓ మిత్రుడు అతి కష్టం మీద బయట పడి ప్రాణాలు దక్కించుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ఏడుకొండలు ఘటనా స్థలానికి చేరుకుని గాజుల్లంకకు చెందిన మత్స్యకారుల సహాయంతో నరేష్ కోసం పడవలపై గాలింపు చర్యలు చేపట్టారు. సరదాగా మిత్రులతో కలిసి వెళ్లిన తన కుమారుడు కనిపించకుండా పోవడంతో అతని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కృష్ణానది ఒడ్డుకు చేరుకుని కన్నీరు మున్నీరవుతూ ప్రాణాలతో తిరిగి వస్తాడనే ఆశతో అక్కడే ఉండి ఎదురు చూస్తుండటం చూపరులను సైతం కంటతడి పెట్టించింది.

మంగళగిరి

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

తాడేపల్లి, న్యూస్‌టుడే : తాడేపల్లి మండల, పట్టణ పరిధిలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.20 వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ డీఈఈ సురేష్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేస్తున్న కారణంగా కృష్ణా కుడి కరకట్ట దిగువ భాగంలో సరఫరా నిలిచిపోతుందని చెప్పారు.

మంగళగిరి: ఎర్రబాలెం పరిధిలో 132 కేవీ కండక్టర్ మార్పు చేస్తున్నందున ఈ నెల 7 నుంచి 9 వరకు ఉదయం 6 నుంచి సాయంత్రం 4 వరకు దాని పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని డీఈఈ సురేష్‌బాబు తెలిపారు.



కాకుమాను: కొండపాటూరులో.. | మంగళగిరిలో.. | తాడేపల్లి శివాలయంలో.. | దుగ్గిరాల: పెదకొండూరు జనార్దన కాలనీలో | తుళ్లూరు: అనంతవరంలో మహాలక్ష్మి.. | పెదనందిపాడులో.. | ప్రత్తిపాడు: బోయపాలెంలో.. | వట్టిచెరుకూరు: లేమల్లెపాడులో.. | తాడికొండలో..

చూసిన కనులదే భాగ్యం

మంగళగిరి, తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అన్ని ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో మహిళలు హాజరై విషేష పూజలు చేశారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. **- న్యూస్‌టుడే, బృందం**

వరగానిలో కనకదుర్గమ్మకు పూజ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, రామాంజనేయులు

ఆలయంలో ప్రత్యేక పూజలు

పెదనందిపాడు, న్యూస్‌టుడే : మండల పరిధి పాలపర్రులోని సూర్యేశ్వర, సోమేశ్వర స్వాముల దేవాలయాల్లో ఆదివారం గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, రామచంద్రరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు మహిళ వీరికి ఆలయ అభివృద్ధి కమిటీ, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు.



పూజలో ఎమ్మెల్యే మాధవి దంపతులు

8న విజయవాడలో సదస్సుకు రండి

దుగ్గిరాల, న్యూస్‌టుడే : విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 8న జరిగే సదస్సుకు రావాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకర్ కోరారు. రైతు, కౌలు రైతు, వ్యవసాయ నాయకులతో కలిసి తుమ్మపూడి, చిలువూరులో ఆయన ఆదివారం పర్యటించారు. జెట్టి బాలరాజు, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, మన్నవ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు సమకూరుస్తాం

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో ఆదివారం జరిగిన అభినందన సభలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమస్యను సీఐ రామానాయక్ వారికి వివరించారు. పెమ్మసాని మాట్లాడుతూ... మండల కేంద్రంలో స్టేషన్ నూతన భవన నిర్మాణానికి 25 సెంట్ల పంచాయతీ స్థలాన్ని కేటాయించినట్లు ప్రకటించారు. మండల కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు సమకూర్చుతామని పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలను అభివృద్ధి చేసేందుకు రూ.50 లక్షలు నిధులు కేటాయిస్తామన్నారు



కేంద్ర సహాయ మంత్రికి సమస్య వివరిస్తున్న సీఐ

రక్షణ గోడ నిర్మాణానికి విరాళం

తాడేపల్లి, న్యూస్‌టుడే : మండల పరిధి పెనుమాకలోని క్రీస్తు కృపాలయ లూథరన్ చర్చి రక్షణ గోడ నిర్మాణం కోసం మంత్రి నారా లోకేశ్ పంపిన రూ.25 వేలు విరాళాన్ని తెదేపా మండల ప్రధాన కార్యదర్శి కొల్లిశేషు ఆదివారం మందిర నిర్వాహకులకు అందజేశారు.

కాల్వలో పడి కారు మెకానిక్ గల్లంతు

దుగ్గిరాల: స్నేహితులతో కలిసి రేపల్లె కాల్వలోకి ఈతకు దిగిన యువకుడు గల్లంతయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. పెదవడ్లపూడికి చెందిన షేక్ ఖాజా(28) కారు మెకానిక్‌గా పని చేస్తుంటాడు. ఆదివారం మధ్యాహ్నం తన నలుగురు స్నేహితులతో కలిసి మండలంలోని రేవేంద్రపాడు వద్దనున్న రేపల్లె కాల్వలో ఈత కొట్టడానికి వచ్చాడు. ఖాజా మరో యువకుడు ఈతకు దిగగా మిగిలిన ముగ్గురు ఒడ్డునే ఉన్నారు. సుమారు 3.30 గంటల సమయంలో ప్రవాహ వేగానికి ఖాజా కొట్టుకుపోయాడు. అతనికి వివాహం కాలేదు. సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎట్టకేలకు స్తంభం సరి చేశారు

ఈనాడు కథనానికి స్పందన

మేడికొండూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని తాగునీటి చెరువు సమీపంలోని పొలాల్లో విద్యుత్తు స్తంభం పక్కకు ఒరిగింది. ఈ నేపథ్యంలో 'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికన 'ఈనాడు'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి ఆ శాఖ ఏఈ పుల్లారెడ్డి స్పందించారు. సిబ్బంది సాయంతో స్తంభాన్ని సరి చేయించారు.

పాముకాటుకు గురై వృద్ధుడి మృతి

తాడికొండ, న్యూస్‌టుడే : పశువులకు మేత కోసేందుకు పొలం వెళ్లి పాముకాటుకు గురై వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పొన్నెకల్లుకు చెందిన దామినేని శ్రీనివాసరావు(58) ఈ నెల ఒకటిన పశువుల మేత కోసేందుకు పొలానికి వెళ్లాడు. ఆ సమయంలో గడ్డి పొదల్లో ఉన్న ఓ విష సర్పంపై పొరపాటున కాలు వేయగా అది శ్రీనివాసురావు కుడి కాలుపై కాటు వేసింది. ఇంటికి వెళ్లి ఆ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపగా వెంటనే చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ 3వ తేదీన మరణించాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అసభ్యకరంగా మాట్లాడిన వ్యక్తులపై కేసు

పెదనందిపాడు, న్యూస్‌టుడే : ఒక మహిళను అసభ్యంగా మాట్లాడిన ఘటన ఇది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. పెదనందిపాడు మండలం కొప్పర్రులో స్టాలిన్ అనే వ్యక్తి చీటి పాటలు నడుపుతుంటాడు. పాడుకున్న వారికి నగదు బకాయి పడ్డాడు. అందులోని ఓ పాట సభ్యుడు చిట్టిబాబు స్టాలిన్ ఇంట్లో లేని సమయంలో వెళ్లి అతని భార్యను డబ్బులు ఇవ్వమని అడిగి అసభ్యకరంగా మాట్లాడాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇన్‌ఛార్జి ఎస్సై నరహరి ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేడికొండూరు, న్యూస్‌టుడే : మహిళతో అసభ్యకరంగా మాట్లాడిన ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని యలవర్తిపాడుకు చెందిన ఒక మహిళ ఆదివారం తమ ఇంటి ముందు పని చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన గాయతోటి రవిబాబు అక్కడకు వచ్చాడు. వివాహితను ఉద్దేశించి అసభ్యకరంగా మాట్లాడాడు. ఆమె బంధువులు కలగజేసుకుని మందలించడంతో అతడు వెళ్లిపోయాడు. గతంలో కూడా ఇదే తరహాలో ప్రవర్తించాడని బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. దీంతో రవిబాబుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బ్లేడుతో దాడి ఘటనపై..

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : చంపుతామని బెదిరించి బ్లేడుతో గొంతు కోసేందుకు ప్రయత్నించి గాయపరిచిన ఘటన ఇది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని వంగిపురానికి చెందిన ఆరుమళ్ల మెహన్ శనివారం అర్ధ రాత్రి మందుల దుకాణానికి వెళ్తుండగా.. స్థానిక మర్రిచెట్టు సెంటర్ వద్ద ఇదే గ్రామానికి చెందిన కొండేపాటి ఏసుబాబు, కారుమూరి బాలస్వామి ఉద్దేశ పూర్వకంగా అతడ్ని ఆపి గొడవ పెట్టుకున్నారు. ఇక్కడిక్కడే చంపుతామని బెదిరించారు. ఈ క్రమంలో ఏసుబాబు తనతో పాటు తెచ్చుకున్న బ్లేడుతో మెహన్ గొంతు కోసేందుకు ప్రయత్నించగా.. అతను పక్కకు తప్పుకోవడంతో గొంతు కింద తెగి తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రుడ్ని 108లో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగేంద్ర తెలిపారు.

కారు అతి వేగంగా నడపడంపై..

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : కారును అతి వేగంగా నడిపి స్కూటీని ఢీకొట్టిన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడికి మక్కెన దివ్యతార, ఆమె స్నేహితురాలైన అమల ఇద్దరు స్కూటీపై గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో యనమదల సమీపంలోని పెట్రోలు బంకు వద్దకు వచ్చేసరికి స్కూటీని కారు డ్రైవర్ ఓవర్ టేక్ చేస్తూ అతివేగంతో దాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దివ్యతార, అమలకు తీవ్ర గాయలయ్యాయి. చికిత్స పొందుతూ దివ్యతార ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నాగేంద్ర చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


పెదనందిపాడు: పెదనందిపాడు-గుంటూరు రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నరసాయపాలేనికి చెందిన జయరావు తన ద్విచక్ర వాహనంపై గుంటూరు నుంచి ఇంటికి వెళ్తుండగా అబ్బినేనిగుంటపాలెం అడ్డరోడ్డు సమీపంలో వాహనం అదుపు తప్పి కింద పడి తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు క్షతగాత్రుడ్ని 108లో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుంటూరు తూర్పు

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని డిమాండ్

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. పరమయ్యకుంటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఇసుక అక్రమార్జన జరిగిందని దీని వల్ల భవన నిర్మాణ కార్మికులకు పనిలేకుండా అల్లాడిపోయారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ధర వరలు



ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో రూ.ల్లో) టమాట 68, వంగ 34, బెండ 24, పచ్చిమిర్చి 24, కాకర 24, క్యారెట్ 43, క్యాలీఫ్లవర్ 38, క్యాబేజీ 24, బీర 24, దొండ 49, బంగాళ దుంప 39, ఉల్లిపాయలు 38, గోరుచిక్కుళ్లు 32, దోస 31, పొట్ల 34, మునగ 8, పెద్ద చిక్కుళ్లు 64, చామ దుంప 38, మునగ 8, గోంగూర 10, తోటకూర 15, కొత్తిమీర 25, బీట్‌రూట్ 28, కీర 34, క్యాప్సికం 65, అల్లం 65, ఫ్రెంచి బీన్స్ 94, సొర 16, అరటి 7. - న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

సమస్యల పరిష్కారం

స్పందనకు వందనం

- నాజ్ కూడలి నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు కాల్వల్లో సిల్ట్ పేరుకుపోయి మురుగు పారుదలకాక ఇబ్బంది పడుతున్నట్టు స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్‌కు తెలియజేయగా ఆ ప్రాంతంలో సిబ్బందిని ఏర్పాటు చేసి కాల్వలపై ఆక్రమణలు తొలగించి సిల్ట్ తీయించారు.
- పాతగుంటూరు శ్మశానరోడ్డులో చెత్త కుప్పలు తీయకపోవడంతో రోజులుగా పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని స్థానికులు సతీష్‌కుమార్ తెలియజేశారు. విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ (గుంటూరు)
- పాతబస్టాండు సెంటర్‌లో ప్రమాదకరంగా మారిన విద్యుత్తు స్తంభానికి అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఆ ప్రాంతంలోని విద్యుత్ స్తంభం కింది భాగంలో తుప్పు పట్టి శిథిలావస్థకు చేరిన విషయమై స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు తెలిపారు. దీన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, స్పందించి విద్యుత్తు స్తంభం కింది భాగంలో సిమెంటు దిమ్మె ఏర్పాటు చేశారు. - న్యూస్‌టుడే, పట్నంబజారు

రహదారుల మోక్షానికి కార్యాచరణ

అందుబాటులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.24.25 కోట్లు

నగరంలో 792 ప్రాంతాల్లో గుంతలు పడినట్లు గుర్తింపు

నగరపాలక సంస్థ, పట్టాభిపురం, న్యూస్‌టుడే

రహదార్ల వారీగా గుర్తించిన గుంతల వివరాలివీ..	
సీసీ రోడ్లు	299
బీటీ రోడ్లు	470
డబ్ల్యుబీఎం/ జీఎస్‌బీ	23

గత నెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన, అంతర్గత రహదారులు ఛిద్రమయ్యాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతూ ప్రయాణించాల్సిన దుస్థితి దాపురించింది. అతుకులు, గతుకులు మయం కావడంతో నడుం, మెడ, కీళ్ల నొప్పుల బారిన పడుతున్నారు. వాహనాలు గుంతల్లో వెళ్తుండడంతో మరమ్మతులకు గురై భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందని వాహనచోదకులు వాపోతున్నారు. అధ్వానపు రహదార్ల గురించి డివిజన్ల వారీగా ఇంజినీరింగ్ విభాగం సర్వే చేపట్టింది. గోతులను పూడ్చి రహదారుల రూపురేఖలు మార్చేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రహదారుల మరమ్మతులు చేసేందుకు నెల రోజులు గడువు ఇవ్వడంతో అధికారులు చర్యలు చేపడుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 24.25 కోట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో నుంచి కొంత నిధుల్ని వీటికి కేటాయించారు. నగరంలో అన్ని రహదార్లలో కలిసి మొత్తం 792 ప్రాంతాల్లో వర్షాలతో గోతులు పడినట్లు గుర్తించారు. వీటన్నింటినీ మరమ్మతులు చేయిచేందుకు డివిజన్ల వారీగా ఏఈలను ఆదేశించారు. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. మరో 20 రోజుల్లో తప్పకుండా మరమ్మతులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు.



మల్లికార్జునపేట ప్రధానరోడ్డులో గోతులు

గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్య ఫలితం..

గత ప్రభుత్వం హయాంలో నగరపాలక సంస్థ పాలకవర్గం ఉన్నా రోడ్లను మెరుగుపర్చడంపై దృష్టి సారించలేదు. ఐదు రహదార్లను విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసినట్లు చెప్పుకుంటూ వచ్చారు. వీటిలో రెండింటిని మాత్రమే పూర్తి చేయగలిగారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు నివాసం ఉండే సంపత్‌నగర్ ప్రాంతం వైపు వెళ్లే దారి, ఆర్.అగ్రహారం, సరస్వతి శిశు మందిరం రోడ్డును మాత్రం ఆఘమేఘాల మీద అభివృద్ధి చేసిన అధికారులు మిగిలిన వాటిని గాలికి వదిలేశారు. పట్టాభిపురం ప్రధాన రహదారి, స్తంభాలగరువు రిజర్వాయర్ల నుంచి బృందావన్ గార్డెన్స్ సెంటర్ వరకు రోడ్లు అధ్వానంగా తయారైంది. విద్యానగర్ మూడో లైను సంగతి గురించి ఇక చెప్పనక్కర్లేదు. వికాస్ నగర్ మూడో లైను, విజయపురి కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రయాణించేందుకు ఏమాత్రం అనువుగా లేవు. కనీసం ఆ మార్గాల్లో గుంతల్ని పూడ్చిన పాపాన పోలేదు. జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు, మంత్రులు నిత్యం తిరిగే నగరంపాలెం మూడు బొమ్మల కూడలి వద్ద రహదారి రెండేళ్ల క్రితమే పాడైనా వాటిని వదిలేశారు. ఇటీవలే ఈ మార్గంలో బీటీ లేయర్ వేసి సమస్య పరిష్కరించారు. నగరంలోని రద్దీ రహదార్లతో పాటు అంతర్గత రహదార్లలో గోతులు పూడ్చేందుకు అధికారులు కార్యాచరణ చేపట్టి పనులు ప్రారంభించారు. ప్రజాప్రతినిధుల చొరవతో త్వరలోనే నగరంలో రహదార్లన్నీ బాగుపడనున్నాయి.

పేదలందరికీ వైద్య సేవలు



రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరునగరం, న్యూస్‌టుడే: పట్టణంలో ఉన్న ప్రతి ఒక్కరికి వైద్యసేవలు అందాలని, ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం హర్షణీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు యాదవ హైస్కూలు ప్రాంగణంలో మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ, రమేష్ ఆసుపత్రి సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మానవతా మెడికల్ ఛైర్మన్ పావులూరు రమేష్, టి.ధనుంజయరెడ్డి, అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు పాల్గొనగా వైద్యులు హైదర్, దీప్తి, రవీంద్ర, గోపి సేవలందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అశోక్, మీరావలి, తిరుపతిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు, రామారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ నేడు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కౌన్సిల్ హాల్‌లో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

బాబోయ్ కుక్కలు



నగరంలో ఏ కాలనీలో చూసినా పదుల సంఖ్యలో శునకాలు దర్శనమిస్తున్నాయి. చిన్న పిల్లలు, మహిళలు కాలనీల్లో ఒంటరిగా వెళితే కుక్కలు వెంట పడుతున్నాయి. పలు సందర్భాల్లో వాహనదారులు కింద పడి గాయాలపాలయ్యారు. పిల్లలపై దాడి చేసిన సంఘటనలు సైతం ఉన్నాయి. అధికారులు వీటి నియంత్రణకు చర్యలు చేపట్టడం లేదని నగరవాసులు వాపోతున్నారు. - ఈనాడు గుంటూరు

ఎస్ఆర్ శంకరన్ వర్ధంతి సభ నేడు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: జీవితాంతం ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడు ఎస్ఆర్ శంకరన్ 14వ వర్ధంతి సభ సోమవారం రామన్నపేటలోని కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జనచైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రకటనలో తెలిపారు. సభకు పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పీవీ రమేష్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు తదితర ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న వారంతా సభకు హాజరవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత శిక్షణ

గుంటూరునగరం, న్యూస్‌టుడే: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం భాష్యం ఆడిటోరియంలో ఎన్ఎంఎంఎస్‌పై ఉచిత శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా యూత్ సర్వీసెస్ డైరెక్టర్ రాధిక మాట్లాడుతూ.. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, చేసే పని ఇష్టంతో చేయాలన్నారు. మానవత సెక్రటరీ సతీష్, డైరెక్టర్లు ఉప్పాల సంవత్సరాలు, ఎన్. సాంబశివరావు, శివాజీ, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్ఎంఎస్ వినియోగించుకోండి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: చోరీల కట్టడికి ప్రజలు ఎల్‌హెచ్ఎంఎస్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదివారం తెలిపారు. ఇంటికి తాళాలు వేసి వేరే ఊరు వెళ్లే వాళ్లు తమ చరవాణిలో ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వెంటనే తమ సిబ్బందిని పంపించి ఆ ఇంటిలో ఉచితంగా ఎల్‌హెచ్ఎంఎస్ పరిజ్ఞానం కలిగిన పరికరాన్ని ఏర్పాటు చేయిస్తామన్నారు. దీంతో తద్వారా ఆయా ఇళ్లల్లో చేసే దొంగతనాలను అరికట్టవచ్చని తెలిపారు.

పేదల అభ్యున్నతికి చేయూత ఇవ్వండి



రాత పుస్తకాలు అందజేస్తున్న ఆతుకూరి సుబ్బారావు

పట్నంబజారు, న్యూస్‌టుడే: పేదల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమవంతు సాయం అందించాలని శ్రీ వాసవీ సేవా సమితి అధ్యక్షుడు ఆతుకూరి సుబ్బారావు అన్నారు. కొత్తపేటలోని ఫ్యాన్సీ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం 600 మంది పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, 50మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,000 ఉపకార వేతనాలు అందజేశారు. కె.వెంకట నరసింహారావు, సీహెచ్. ఉమా, దామోదరరావు, శేష ప్రభాకరరావు, రామకృష్ణ ఉన్నారు.

ముగిసిన యూటీఎఫ్ క్రీడోత్సవం



విజేతలతో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

నగరపాలక సంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) స్వర్ణోత్సవాల్లో భాగంగా గుంటూరు నగరంలో నిర్వహిస్తున్న రాష్ట్ర క్రీడోత్సవం ఆదివారంతో ముగిసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్‌లు తెలిపారు. క్రికెట్‌లో ఛాంపియన్‌గా నిలిచిన ఏలూరు జట్టు క్రీడాకారులకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు బహుమతులు అందజేశారు. క్రికెట్ అసోసియేషన్ నాయకులు పరమహంస, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్, ఏఎన్.కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రాకుండా నిరోధించొచ్చు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: చిన్నతనం నుంచే తల్లిదండ్రులు పిల్లలకు చక్కని జీవనశైలిని అలవాటు చేస్తే మూడింట ఒక వంతు క్యాన్సర్లను రాకుండా నిరోధించవచ్చని సర్జికల్ ఆంకాలజిస్ట్ ఫణీంద్రకుమార్ సూచించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ మద్యానికీ, పొగాకుకీ దూరంగా ఉండాలన్నారు. బరువు పెరగకుండా చూసుకోవాలన్నారు. ఒకసారి వాడిన నూనెను మళ్లీమళ్లీ వాడొద్దన్నారు. ఒత్తిడి లేని వృత్తి జీవితం, ఉల్లాసంగా ఉండడంతో పాటు మనసుకు హాయినిచ్చే అభిరుచుల్ని ఎంచుకోవాలన్నారు. వ్యాధిని తొలి దశలోనే గుర్తించి చికిత్స అందించగలిగితే జీవితాన్ని హాయిగా గడిపేలా చేయొచ్చన్నారు. సమావేశంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సభ్యులు అంజిరెడ్డి, రవిచంద్ర, భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మరూపం.. ఆనందభరితం

ఘనంగా శరన్నవరాత్రి మహోత్సవాలు



పూలమార్కెట్ సెంటర్: లలితా త్రిపుర సుందరిగా..



గాంధీబొమ్మ సెంటర్‌లో...




ఇందిరాప్రియదర్శినీకాలనీలో అమ్మవారు



సీతానగర్‌లో లలిత త్రిపుర సుందరీదేవి



వీవర్స్‌కాలనీలో గాయత్రీ మాత



పరమయ్యకుంటలో లలిత త్రిపుర సుందరీదేవి

నగరంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నాల్గో రోజు ఆదివారం వైభవంగా నిర్వహించారు. మోతీలాల్‌నగర్, పరమయ్యకుంట, సీతానగర్, కొత్తపేట, కాకుమానువారివీధి, రైలుపేట, లాలాపేట, కొత్తపేట, గుంటూరువారితోట, ఆర్టీసీ కాలనీ, మంగళదాస్‌నగర్, బుచ్చయ్యతోట, నెహ్రూనగర్, ఏటుకూరురోడ్డు, పట్నంబజారు తదితర ప్రాంతాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. - న్యూస్‌టుడే, నెహ్రూనగర్, పట్నంబజారు



బుచ్చయ్యతోట గాయత్రీదేవి



గంటలమ్మచెట్టువీధిలోని దేవాలయంలో..



గుంటగ్రౌండ్ వద్ద సామూహిక కుంకుమ పూజలు



నెహ్రూనగర్‌లో పుష్పశయన అలంకారం



తమ్మారంగారెడ్డినగర్: చండీహోమం




వేణుగోపాలస్వామి ఆలయంలో సంతానలక్ష్మి



చినమహాలక్ష్మమ్మ ఆలయంలో శ్రీచండీదేవి



లాలాపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనలక్ష్మిదేవి



ఏటుకూరురోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయంలో

జీవవైవిధ్యంపై అవగాహన అవసరం

నగరపాలకసంస్థ: సమాజంలోని అందరూ జీవవైవిధ్యం గురించి తెలుసుకోవాలని రాష్ట్ర జీవవైవిధ్య మండలి కార్యదర్శి బీపీఏ కృష్ణమూర్తి అన్నారు. ఈనెల 2 నుంచి 8 వరకు వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రభుత్వ మహిళా కళాశాల ఎకో క్లబ్, రాష్ట్ర జీవవైవిధ్య మండలి ఆధ్వర్యంలో విద్యార్థినులు ఉప్పలపాడు పక్షుల సంరక్షణ కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. అటవీశాఖ రేంజ్ అధికారి పోతురాజు మాట్లాడుతూ.. ఉప్పలపాడుకు వచ్చే వలస పక్షుల ప్రాముఖ్యత వివరించారు. విశ్రాంత డీఎఫ్‌వో కె.సత్యనారాయణ, ఎకో క్లబ్ సమన్వయకర్త, వృక్షశాస్త్ర విభాగాధిపతి ఎం.సంతోషకుమారి, షేక్ గాలీబ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలోకి రోగులు, సహాయకులకే అనుమతి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రిలోకి రోగులు, వారి సహాయకులు మాత్రమే రావాలని సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ సూచించారు. ప్రధాన గేటు వద్ద సుందరీకరణ పనులను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు శనక్కాయల ఉమాశంకర్‌తో కలిసి ఆదివారం శంకుస్థాపన చేసిన అనంతరం కిరణ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. జీజీహెచ్ లోపల గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుండడంతో వైద్యులు, సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇటీవల రక్షణ కల్పించాలని జూనియర్ వైద్యులు సమ్మె చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అందువల్ల ఆసుపత్రిలోకి ఇతరులను అనుమతించమన్నారు. ఆసుపత్రి బయట దుర్గంధభరితంగా ఉన్న పరిసరాల్ని శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇందుకోసం ఆదివారాన్ని పనివారంగా మార్చామన్నారు. జీజీహెచ్ లోపల వాహనాల పార్కింగ్ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నట్లు వివరించారు.

కార్మికుల సంఖ్య పెంచండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : గుంటూరు నగరంలో జనాభాకు తగ్గట్టుగా కార్మికుల సంఖ్య పెంచి ఇప్పుడు విధులు నిర్వహిస్తున్న వారిపై పని ఒత్తిడి తగ్గించాలని సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి డిమాండ్ చేశారు. మణిపురం బ్రిడ్జి కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. మాల్యాద్రి మాట్లాడుతూ.. 42 కార్మిక చట్టాలను తొలగించి నూతనంగా ఏర్పాటు చేసిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బుజ్జి, ఏసురత్నం, జాన్, నాగరాజు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు..



చౌత్రా సెంటర్‌లో కొద్దిరోజుల కిందట అధికారులు పైపు లైన్ల ఏర్పాటు కోసం రోడ్డులో తవ్వకాలు చేశారు. రోజులు గడుస్తున్న పైపు లైన్లు ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. దీంతో ఇటుగా రాకపోకలు చేసే వాహనదారులు, పాదచారులు ప్రమాదవశాత్తు గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారు. ఈ ప్రాంతంలో పాఠశాలలు ఎక్కువగా ఉండడంతో తమ పిల్లలకు ఏం జరుగుతుందోనని పిల్లల్ని పాఠశాలలకు పంపేందుకు వెనుకంజ వేస్తున్నారు. అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పట్నంబజారు

మలుపులో గుంత.. రాకపోకలకు చింత

గుంటూరు నగరంలోని వాహనాలు ఇన్నర్‌రింగ్ రోడ్డులోంచి కాకాని రోడ్డులోకి ప్రవేశించే రహదారి మలుపులో భారీ గొయ్యి ఏర్పడింది. ప్రమాదాలు జరగకుండా పోలీసులు మలుపులో బారికేడ్‌ను ఏర్పాటు చేశారు. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో క్రమంగా రోడ్డు కోతకు గురి అవుతోంది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోని వాహనదారులు భయపడుతున్నారు. ఇప్పటికైనా గుంటూరు కార్పొరేషన్ అధికారులు గొయ్యిని పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆటోనగర్



గుంటూరు పశ్చిమ

సలహా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి


ఓటర్లు పూరించిన దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సలహా కేంద్రాన్ని వినియోగించుకోవాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు. విద్యానగర్ ప్రధాన రహదారిలోని ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన శిబిరాన్ని ఆమె ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేసిన వారు కూడా మళ్లీ ఓటు నమోదు చేసుకోవాల్సిందేనన్నారు. నవంబర్ 6వ తేదీ లోగా సంబంధిత ధ్రువపత్రాలు అటెస్టేషన్ చేయించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓట్లు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, వేములపల్లి శ్రీరాంప్రసాద్, ఎన్నారై విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు, నవీన్ చౌదరి, రాధ, కల్యాన్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
97042 53525, 80085 74897

స్పందనకు వందనం

● **మురుగు సమస్య పరిష్కారం:** బ్రాడీపేట, ఒకటో వీధి నుంచి 4వ వీధి మురుగు కాల్వల్లో చెత్త, చెదారం పేరుకుపోవడంతో పారుదలకు ఆటంకం ఏర్పడగా.. ఈ సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి బాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాల్వల్లో మురుగు తొలగింపునకు చర్యలు తీసుకున్నారు.

● **చెట్ల కొమ్మల తొలగింపు:** కన్నావారితోటలోని పలు వీధుల్లో చెట్టుకొమ్మలు పెరిగి వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఉండడంతో ఈ సమస్యను శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి కొమ్మల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, నగరంపాలెం

చోరీల కట్టడికి ఎల్‌హెచ్ఎంఎస్ వినియోగించుకోండి

గుంటూరు నేరవార్తలు: చోరీల కట్టడికి ప్రజలు ఎల్‌హెచ్ఎంఎస్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఇంటికి తాళాలు వేసి వేరే ఊరు వెళ్లే వాళ్లు తమ చరవాణిలో ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వెంటనే తమ సిబ్బందిని పంపించి ఆ ఇంటిలో ఉచితంగా ఎల్‌హెచ్ఎంఎస్ పరిజ్ఞానం కలిగిన పరికరాన్ని ఏర్పాటు చేయిస్తామన్నారు. దీంతో తద్వారా ఆయా ఇళ్లల్లో చేసే దొంగతనాలను అరికట్టవచ్చని తెలిపారు.

రహదారుల రూపురేఖలు మారనున్నాయ్

గుంతలకు పూర్తి స్థాయిలో మరమ్మతులకు కార్యాచరణ

పట్టాభిపురం, నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

గత నెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన, అంతర్గత రహదారులు ఛిద్రమయ్యాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతూ ప్రయాణించాల్సిన దుస్థితి దాపురించింది. అతుకులు, గతుకులు మయం కావడంతో నడుం, మెడ, కీళ్ల నొప్పుల బారిన పడుతున్నారు. వాహనాలు గుంతల్లో వెళ్తుండడంతో మరమ్మతులకు గురై భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందని వాహనచోదకులు వాపోతున్నారు. అధ్వానపు రహదార్ల గురించి డివిజన్ల వారీగా ఇంజినీరింగ్ విభాగం సర్వే చేపట్టింది. గోతులను పూడ్చి రహదారుల రూపురేఖలు మార్చేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రహదారుల మరమ్మతులు చేసేందుకు నెల రోజులు గడువు ఇవ్వడంతో అధికారులు చర్యలు చేపడుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.24.25 కోట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో నుంచి కొంత నిధుల్ని వీటికి కేటాయించారు. నగరంలో అన్ని రహదార్లలో కలిపి మొత్తం 792 ప్రాంతాల్లో వర్షాలతో గోతులు పడినట్లు గుర్తించారు. వీటన్నింటినీ మరమ్మతులు చేయిచేందుకు డివిజన్ల వారీగా ఏఈలను ఆదేశించారు. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. మరో 20 రోజుల్లో తప్పకుండా మరమ్మతులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు.


విద్యానగర్ మూడో లైనులోని రోడ్డు గుంతలమయం

రహదార్ల వారీగా గుర్తించిన గుంతల వివరాలివీ..	
సీసీ రోడ్లు	299
బీటీ రోడ్లు	470
డబ్ల్యుబీఎం/ జీఎస్‌బీ	23

గత ప్రభుత్వ హయాంలో గాలికి వదిలేసిన ఫలితం..

గత ప్రభుత్వం హయాంలో నగరపాలక సంస్థ పాలకవర్గం ఉన్నా రోడ్లను మెరుగుపర్చడంపై దృష్టి సారించలేదు. ఐదు రహదార్లను విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసినట్లు చెప్పుకుంటూ వచ్చారు. వీటిలో రెండింటిని మాత్రమే పూర్తి చేయగలిగారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు నివాసం ఉండే సంపత్‌నగర్ ప్రాంతం వైపు వెళ్లే దారి, ఆర్.అగ్రహారం, సరస్వతి శిశు మందిరం రోడ్డును మాత్రం ఆఘమేఘాల మీద అభివృద్ధి చేసిన అధికారులు మిగిలిన వాటిని గాలికి వదిలేశారు. పట్టాభిపురం ప్రధాన రహదారి, స్తంభాలగరువు రిజర్వాయర్ల నుంచి బృందావన్ గార్డెన్స్ సెంటర్ వరకు రోడ్లు అధ్వానంగా తయారైంది. విద్యానగర్ మూడో లైను సంగతి గురించి ఇక చెప్పనక్కర్లేదు. వికాస్ నగర్ మూడో లైను, విజయపురి కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రయాణించేందుకు ఏమాత్రం అనువుగా లేవు. కనీసం ఆ మార్గాల్లో గుంతల్ని పూడ్చిన పాపాన పోలేదు. జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు, మంత్రులు నిత్యం తిరిగే నగరంపాలెం మూడు బొమ్మల కూడలి వద్ద రహదారి రెండేళ్ల క్రితమే పాడైనా వాటిని వదిలేశారు. ఇటీవలే ఈ మార్గంలో బీటీ లేయర్ వేసి సమస్య పరిష్కరించారు. నగరంలోని రద్దీ రహదార్లతో పాటు అంతర్గత రహదార్లలో గోతులు పూడ్చేందుకు అధికారులు కార్యాచరణ చేపట్టి పనులు ప్రారంభించారు. ప్రజాప్రతినిధుల చొరవతో త్వరలోనే నగరంలో రహదార్లన్నీ బాగుపడనున్నాయి.


వికాస్‌నగర్ మూడో లైన్ రహదారి దుస్థితి

ఆసుపత్రిలోకి రోగులు, సహాయకులకే అనుమతి


ఆసుపత్రి బయట సుందరీకరణ పనులు ప్రారంభిస్తున్న కిరణ్‌కుమార్, పక్కన ఉమాశంకర్ తదితరులు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రిలోకి రోగులు, వారి సహాయకులు మాత్రమే రావాలని సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ సూచించారు. ప్రధాన గేటు వద్ద సుందరీకరణ పనులను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు శనక్కాయల ఉమాశంకర్‌తో కలిసి ఆదివారం శంకుస్థాపన చేసిన అనంతరం కిరణ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. జీజీహెచ్ లోపల గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుండడంతో వైద్యులు, సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇటీవల రక్షణ కల్పించాలని జూనియర్ వైద్యులు సమ్మె చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అందువల్ల ఆసుపత్రిలోకి ఇతరులను అనుమతించమన్నారు. ఆసుపత్రి బయట దుర్గంధభరితంగా ఉన్న పరిసరాల్ని శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇందుకోసం ఆదివారాన్ని పనివారంగా మార్చామన్నారు. జీజీహెచ్ లోపల వాహనాల పార్కింగ్ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నట్లు వివరించారు.

లోక కల్యాణార్థం లక్ష మోదక హోమం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సంపత్ నగర్ ప్రధాన వీధిలోని హరిసన్నిధి ఆధ్యాత్మిక సంస్థలో లోక కల్యాణార్థం లక్ష మోదక హోమం ఆదివారం జరిగింది. గణపతి ప్రీతి కోసం ప్రతి నెలా శుద్ధ చవితి నాడు ఈ హోమం నిర్వహిస్తున్నారు. సహస్ర మోదక హోమాన్ని కోటనాగరాజ శర్మ అవధాని ఈ క్రతువు నిర్వహించారు.


విజేతలతో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సంఘ నాయకులు తదితరులు

ముగిసిన యూటీఎఫ్ క్రీడోత్సవం

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) స్వర్ణోత్సవాల్లో భాగంగా గుంటూరు నగరంలో నిర్వహిస్తున్న రాష్ట్ర క్రీడోత్సవం ఆదివారంతో ముగిసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాదులు తెలిపారు. క్రికెట్‌లో ఛాంపియన్‌గా నిలిచిన ఏలూరు జట్టు క్రీడాకారులకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు బహుమతులు అందజేశారు. క్రికెట్ అసోసియేషన్ నాయకులు పరమహంస, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్, ఏఎన్.కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జీవీ రమణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురై.. ప్రమాదకరంగా మారి..



స్థానిక రెడ్డిపాలెం నుంచి ఇన్నర్‌రింగ్‌రోడ్డు వైపునకు వెళ్లే మార్గంలోని మురుగునీటి డ్రెయిన్ చప్టా ఇటీవల వర్షాలకు కోతకు గురైంది. చప్టాను అనుకుని ఉన్న మట్టి మొత్తం కాలువలోకి కొట్టుకుపోయింది. దీంతో చప్టా దాటే సమయంలో గమనించక వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి దీనికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు - న్యూస్‌టుడే, గోరంట్ల

బాబోయ్ కుక్కలు

నగరంలో ఏ కాలనీలో చూసినా పదుల సంఖ్యలో శునకాలు దర్శనమిస్తున్నాయి. చిన్న పిల్లలు, మహిళలు కాలనీల్లో ఒంటరిగా వెళితే కుక్కలు వెంట పడుతున్నాయి. పలు సందర్భాల్లో వాహనదారులు కింద పడి గాయాలపాలయ్యారు. పిల్లలపై దాడి చేసిన సంఘటనలు సైతం ఉన్నాయి. ఇంత జరుగుతున్నా నగరపాలక సంస్థ అధికారులు వీటి నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని నగరవాసులు వాపోతున్నారు.
- ఈనాడు గుంటూరు



నాసిరకం పనులు.. జనానికి తిప్పలు

నగరంలోని కొరిటెపాడు-అమరావతి రోడ్డు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. పక్కనే ప్రధాన డ్రెయినేజీ కాలువ ఉన్నా పనులు నాసిరకంగా చేయడంతో రహదారి రెండుగా చీలి మురుగుకాలువ వైపు కుంగిపోయింది. కొరిటెపాడు నుంచి పలు కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో వెంటనే బాగుచేసి ప్రమాదాలు జరగకుండా నివారించాలని నగరవాసులు కొరుతున్నారు.
- ఈనాడు గుంటూరు




చుట్టగుంట పోలేరమ్మ గుడిలో..


ఏటీ అగ్రహారం ఆలయంలో భక్తుల పూజలు


మల్లారెడ్డినగర్ అయ్యప్ప ఆలయంలో..


గాయత్రి దత్తసాయి ఆలయంలో..



శ్రీనివాసరావుతోటలో మహిళల కుంకుమ పూజలు

శక్తి స్వరూపిణి.. ముక్తిప్రదాయిని

గుంటూరు సాంస్కృతికం, ఏటీ అగ్రహారం, పట్టాభిపురం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలోని పలు దేవాలయాల్లో అమ్మవారి విజయగాథలను తెలిపే విభిన్న రూపాల అలంకారాలను తీర్చిదిద్దారు. జగజ్జనని లీలా విలాసాలను ప్రతిబింబేలా అలంకార సేవలు కనిపించాయి. విద్యానగర్ సాయినాథ సన్నిధానం, బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం, మారుతీనగర్ మారుతీ దేవాలయం, పట్టాభిపురంలోని రామలింగేశ్వరస్వామి, కొరిటెపాడులోని కోదండరామాలయం, ఆర్.అగ్రహారం వేంకటేశ్వర స్వామి దేవాలయాల్లో అలంకృత అమ్మవారి సందర్శనకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. చుట్టుగుంట పోలేరమ్మ గుడి, ఏటీ అగ్రహారం, మల్లారెడ్డినగర్ అయ్యప్పస్వామి, శ్రీనివాసరావుతోట 6వ లైన్‌లోని శ్రీవీరాంజనేయస్వామి, గాయత్రి దత్తసాయి ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానాల్లో గణపతి, నవగ్రహ పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పెదనందిపాడు మండలం పాలపర్రులోని సూర్యేశ్వర, సోమేశ్వర స్వాముల దేవాలయాల్లో పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, రామచంద్రరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పట్టాభిపురం రామలింగేశ్వర స్వామి ఆలయంలో


కొరిటెపాడులోని కోదండరామాలయంలో..


ఎస్వీఎన్ కాలనీ వేంకటేశ్వరాలయంలో


వికాస్‌నగర్‌లోని శిర్డీ సాయి మందిరంలో..


విద్యానగర్ సాయినాథ సన్నిధానంలో లలితాత్రిపురసుందరి అలంకార పూజ


శారదాపరమేశ్వరి దేవస్థానంలో..


ఆర్.అగ్రహారం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో..


మారుతీ దేవాలయంలో కాళీ మాత అలంకారం


బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో..

అలరించిన భక్తిగీతాలాపన

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి జరిగిన భక్తి సంకీర్తనలహరి ప్రేక్షకులను అలరించింది. ఎంవీ రత్తయ్య, సుజాత ఆధ్వర్యంలో పెదవడ్లపూడి వీరబ్రహ్మేంద్ర భజన సమాజం బృందం భక్తి గీతాలాపన చేశారు. సత్సంగ సభ్యులు లలితా సహస్రనామ పారాయణ నిర్వహించారు. తొలుత ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ముందు జాగ్రత్తలతో క్యాన్సర్లు రాకుండా నిరోధించొచ్చు



ప్రసంగిస్తున్న ఫణీంద్రకుమార్

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: చిన్నతనం నుంచే తల్లిదండ్రులు పిల్లలకు చక్కని జీవనశైలిని అలవాటు చేస్తే మూడింట ఒకవంతు క్యాన్సర్లను రాకుండా నిరోధించవచ్చని సర్జికల్ ఆంకాలజిస్ట్ ఫణీంద్రకుమార్ సూచించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ మద్యానికీ, పొగాకుకీ దూరంగా ఉండాలన్నారు. బరువు పెరగకుండా చూసుకోవాలన్నారు. ఒకసారి వాడిన నూనెను మళ్లీమళ్లీ వాడొద్దన్నారు. ఒత్తిడి లేని వృత్తి జీవితం, ఉల్లాసంగా ఉండడంతో పాటు మనసుకు హాయినిచ్చే అభిరుచుల్ని ఎంచుకోవాలన్నారు. వ్యాధిని తొలి దశలోనే గుర్తించి చికిత్స అందించగలిగితే జీవితాన్ని హాయిగా గడిపేలా చేయొచ్చన్నారు. సమావేశంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సభ్యులు అంజిరెడ్డి, రవిచంద్ర, భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంతో మందికి ప్రాణం పోశారు


శేషాద్రి శేఖర్ దంపతులను సన్మానిస్తున్న వైద్యులు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఆధునిక చికిత్సలతో ఎంతోమంది ప్రాణాలను ఆచార్య శేషాద్రి శేఖర్ కాపాడారని పలువురు వక్తలు కొనియాడారు. గుంటూరు సర్వజనాసుపత్రి, విజయవాడ, ఒంగోలు ప్రభుత్వాసుపత్రుల్లో న్యూరోసర్జన్‌గా పనిచేసి గతనెల 30న ఉద్యోగ విరమణ చేసిన శేషాద్రి శేఖర్‌కు ఆదివారం గుంటూరులోని ఓ హోటల్‌లో అభినందన సదస్సు ఏర్పాటు చేశారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ న్యూరోసర్జన్లకు ప్రయివేటుగా విపరీతమైన డిమాండ్ ఉన్నప్పటికీ ప్రభుత్వాసుపత్రుల్లోనే చివరి వరకు పని చేశారన్నారు. అత్యవసరంగా సర్జరీలు చేయాల్సి ఉంటుందని అర్ధరాత్రి వరకు విధులు నిర్వహించేవారని అభినందించారు. విద్యార్థి వైద్యులకు చక్కని శిక్షణ ఇచ్చారన్నారు. న్యూరోసర్జన్ హనుమ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సదస్సు నిర్వహించారు. అనంతరం శేషాద్రి శేఖర్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సుందరాచారి, కాటూరి వైద్య కళాశాల డీన్ వరప్రసాద్, న్యూరోసర్జరీ విభాగం అధిపతి సత్యనారాయణమూర్తి, సహాచార్యులు పెంచలయ్య, సీనియర్ వైద్యులు అమర్‌నాథ్, తారకనాథ్, శివరామకృష్ణ, కుమార్‌వేళు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, వైద్యులు, నర్సింగ్, నాలుగో తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సమితి ఔదార్యం


లబ్ధిదారులతో నిర్వాహకులు, అతిథులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బ్రాడీపేట బ్రాహ్మణ సేవా సమితి ప్రాంగణంలో దేవీ శరన్నవరాత్రులు సందర్భంగా దాతల సహకారంతో బ్రాహ్మణ స్త్రీలకు, వేద విద్యార్థులకు ఆదివారం నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమానికి బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు ఆర్.లక్ష్మీపతి అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథిగా వావిలాల సత్యం పాల్గొన్నారు. బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు దాతలను సన్మానించారు. సమన్వయకర్త పాతూరి శ్రీనాథ్, కార్యదర్శి తుళ్లూరు ప్రకాష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు ఆదిరాజు శ్రీధర్, గొల్లపూడి రామకృష్ణారావు, కోశాధికారి కర్లపాలెం బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులు జీవీఎల్ఎన్ సంజీవరావు, మతుకుమల్లి కోదండ రామారావు, పొత్తూరు మురళీమోహన్, మాదల వెంకటకృష్ణ, కటకరాజు సాయిబాబాశర్మ, బండారుపల్లి ప్రసాద్, సంబరాజు రవికుమార్, అవ్వారి మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి చేయూత ఇవ్వండి


రాత పుస్తకాలు అందజేస్తున్న సుబ్బారావు

పట్నంబజారు, న్యూస్‌టుడే: పేదల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ సాయం అందించాలని శ్రీవాసవీ సేవా సమితి అధ్యక్షుడు ఆతుకూరి సుబ్బారావు అన్నారు. కొత్తపేటలోని ఫ్యాన్సీ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం 600 మంది పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, 50 మందికి రూ.1,000 చొప్పున ఉపకార వేతనాలు అందజేశారు. కె.వెంకట నరసింహారావు, సీహెచ్.ఉమా, దామోదరరావు, శేష ప్రభాకరరావు, రామకృష్ణ ఉన్నారు.



భయపడుతూ వెళ్లాల్సిందే..!

దశాబ్దాల కిందట నిర్మించిన జీజీహెచ్ పాత భవనంలో పలు ప్రాంతాల్లో స్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. నిత్యం వేలాది మంది రోగులు, సహాయకులు ఆ భవనంలో తిరుగుతుంటారు. గోడలు, స్లాబులు పగుళ్లివ్వగా.. కొన్నిచోట్ల పెచ్చులూడి పడుతున్నాయి. అక్కడే ఉన్న సూపరింటెండెంట్ కార్యాలయం వెనుక భాగంలో స్లాబ్ ప్రమాదకరంగా మారింది. అటుగా స్ట్రెచర్లు, చక్రాల కుర్చీల్లో రోగులను తరలిస్తుంటారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రోగుల సహాయకులు భయపడుతున్నారు.
-న్యూస్‌టుడే, నగరంపాలెం

విద్యుదాఘాతంతో వాచ్‌మెన్ మృతి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో వాచ్‌మెన్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కంకరగుంట ప్రాంతానికి చెందిన దేవానంద్(53) ఒక అపార్ట్‌మెంట్‌కు వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. శనివారం అతిగా మద్యం తాగి దేవానంద్ పట్టాభిపురం ఠాణాకు వెళ్లే రోడ్డులో మద్యం మత్తులో కూర్చున్నాడు. పక్కనే చికెన్ షాప్ ఉంది. అక్కడ విద్యుత్తు తీగల్ని మద్యం మత్తులో తాకాడు. దీంత్ షాక్ కొట్టి అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈనాడు సినిమా

నిఖిల్.. 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'


రుక్మిణీ వసంత్, నిఖిల్

కథానాయకుడు నిఖిల్.. దర్శకుడు సుధీర్ వర్మ కలయికలో ఓ చిత్రం తెరకెక్కింది. 'స్వామిరారా', 'కేశవ'ల తర్వాత వీళ్లిద్దరి నుంచి వస్తున్న మూడో సినిమా ఇది. బి.బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించారు. రుక్మిణీ వసంత్ కథానాయిక. దివ్యాంశ కౌశిక్ కీలక పాత్ర పోషించింది. ఈ సినిమాకి 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మేరకు ఆదివారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అందులో నిఖిల్, రుక్మిణి ఓ నది చెంత జంటగా నడిచొస్తూ కనిపించారు. "ప్రేమ కథతో ముడిపడి ఉన్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. నిర్మాణానంతర పనులు ముగింపు దశలో ఉన్నాయి. దీపావళి సందర్భంగా సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: కార్తీక్, నేపథ్య సంగీతం: సన్నీ ఎం.ఆర్, ఛాయాగ్రహణం: రిచర్డ్ ప్రసాద్.

టీజర్ చూసి మహేశ్‌బాబు మెచ్చుకున్నారు


అశోక్ గల్లా, మానస వారణాసి


'దేవకీ నందన వాసుదేవ'తో సినీప్రియుల్ని అలరించనున్నారు మహేశ్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని అర్జున్ జంధ్యాల తెరకెక్కించారు. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మించారు. మానస వారణాసి కథానాయిక. దర్శకుడు ప్రశాంత్ వర్మ కథ అందించారు. ఈ సినిమా నవంబరు 14న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఆదివారం ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో అశోక్ గల్లా మాట్లాడుతూ.. "ఇది విజయనగరం నేపథ్యంలో జరిగే కథ. నేనిందులో కృష్ణ పాత్రలో కనిపిస్తా. టీజర్ చూసి మహేశ్‌బాబు బాగుందని మెచ్చుకున్నారు. మాకింత మంచి కథ ఇచ్చినందుకు ప్రశాంత్ వర్మకు కృతజ్ఞతలు" అన్నారు. "భీమ్స్ దీన్ని 'మురారి'తో పోల్చారు. స్క్రీన్‌ప్లే బాగా కుదిరింద"న్నారు దర్శకుడు అర్జున్.

మంచి కథ.. ఓ ట్విస్ట్


పరుచూరి వెంకటేశ్వరరావు, సుదర్శన్

పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు సుదర్శన్ పరుచూరి హీరోగా రవి కిశోర్ తెరకెక్కించిన చిత్రం 'మిస్టర్ సెలెబ్రిటీ'. చిన్న రెడ్డయ్య, ఎన్.పాండు రంగారావు సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. "సెలెబ్రిటీలపై పుకార్లు రావడం.. వాటి వల్ల ఏర్పడే పర్యవసానాల నేపథ్యంలో దర్శకుడు మంచి కథ అల్లుకున్నాడు. ఇందులోని ట్విస్ట్ కూడా అందర్నీ మెప్పిస్తుంది' అన్నారు. కార్యక్రమంలో బి. గోపాల్, రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.

సెట్లో అడుగుపెట్టేవరకూ హీరో షారుక్ అని తెలియదు



చిత్రపరిశ్రమలో ఎంతో మంది అందాల తారలు షారుక్‌తో కలిసి నటించాలని ఉవ్విళ్లూరుతుంటారు. కానీ తనకొచ్చిన ఆయనతో కలిసి నటించాలని ఆలోచన రాలేదని, అనుకోకుండా వచ్చిన ఓ అవకాశంతో తన కెరీర్ మలుపు తిరిగిందని అంటోంది బాలీవుడ్ కథానాయిక సుస్మితా సేన్. ఈమె, షారుక్ జంటగా నటించిన 'మై హూనా' చిత్రానికి అప్పట్లో మంచి మార్కులే పడ్డాయి. ఎన్నో విజయవంతమైన పాటలకు కొరియోగ్రాఫర్‌గా పనిచేసిన దర్శకురాలు ఫరాఖాన్ తెరకెక్కించిన మొదటి చిత్రమిది. ఇందులో చాందినీ పాత్రలో కనిపించి యువతను విశేషంగా ఆకట్టుకుంది సుస్మితా సేన్. కానీ ఈ సినిమా సెట్లో అడుగుపెట్టే వరకూ.. షారుక్ ఇందులో భాగమని తెలియదని ఓ సందర్భంలో పంచుకుందామె. "సర్, తుమ్ తో 'దిల్బర్ దిల్బర్' అనే పాట చిత్రీకరిస్తున్నప్పుడు ఫరా.. తను దర్శకత్వం వహించే మొదటి సినిమాలో హీరోయిన్‌గా నువ్వే స్తారా అని అడిగారు. కచ్చితంగా నటిస్తానని మాట ఇచ్చాను. కొన్నేళ్లకు ఆమె తన తొలి చిత్ర కథతో నన్ను సంప్రదించారు. ఓ రోజు షూటింగ్‌కు రమ్మని ఫిల్మ్ సిటీకి పిలిచారు ఫరా. షూటింగ్ స్పాట్‌కి వెళ్లే సరికి అక్కడ షారుక్‌ను చూసి ఆశ్చర్యపోయాను. 'మై హూనా'లో షారుక్ హీరోయిన్ అవుతానని ఎప్పుడూ ఊహించలే'దని ఆనాటి సంగతులను గుర్తుచేసుకుంది సుస్మితా సేన్.

ఫ్లాష్‌బ్యాక్

33ఏళ్ల తర్వాత మళ్లీ?


మణిరత్నం


రజనీ కాంత్

కథానాయకుడు రజనీకాంత్.. దర్శకుడు మణిరత్నం 33ఏళ్ల తర్వాత తిరిగి కలిసి పని చేయబోతున్నారా? అంటే అవుననే చెబుతున్నాయి కోలీవుడ్ వర్గాలు. రజనీ - మణిరత్నం కలయికలో వచ్చిన 'దళపతి' 1991లో విడుదలై బాక్సాఫీస్ ముందు భారీ విజయాన్ని అందుకుంది. కానీ, ఆ తర్వాత ఈ ఇద్దరూ మళ్లీ కలిసి పని చేయలేదు. అయితే ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత ఈ హిట్ కాంబో పునరావృతం కానుందని సమాచారం. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ విషయమై రజనీకాంత్, మణిరత్నంకు మధ్య చర్చలు జరిగాయని.. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే డిసెంబరులో రజనీ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాపై స్పష్టత వచ్చే అవకాశముందని తెలిసింది. ప్రస్తుతం రజనీ నటించిన 'వేట్టయన్' విడుదలకు సిద్ధమవగా.. 'కూలీ' చిత్రీకరణ దశలో ఉంది. 'జైలర్ 2' పట్టాలెక్కేందుకు సిద్ధంగా ఉంది. అలాగే మరో ఇద్దరు యువ దర్శకులు రజనీ కోసం కథలు సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారు. ఇక మణిరత్నం ప్రస్తుతం కమల్‌హాసన్‌తో 'థగ్ లైఫ్' చేస్తున్నారు. 'నాయకన్' (1987) విజయం తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న సినిమా ఇది. వేసవికి ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలుస్తోంది.

'కూలీ' వైజాగ్‌లో ముగించారు..

రజనీకాంత్ - లోకేశ్ కనగరాజ్ కలయికలో తెరకెక్కుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ'. కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. నాగార్జున, శ్రుతిహాసన్, ఉపేంద్ర తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ కొన్నాళ్లుగా విశాఖపట్నంలో జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ షెడ్యూల్‌కు సంబంధించి రజనీ పాత్ర షూట్ ఇప్పటికే పూర్తవగా.. ఇప్పుడు మొత్తం షెడ్యూల్‌ను ముగించారు. ఈ విషయాన్ని శ్రుతిహాసన్ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించింది.

సైకో.. దెయ్యం పాత్రలు చేయాలనుంది!

"వినూత్నమైన కథతో యాక్షన్, వినోదం మేళవింపుగా రూపొందిన సినిమా 'విశ్వం'. ఈ చిత్ర విషయంలో నటిగా నాకు ప్రతీ సవాల్‌గానే అనిపించింది" అంటోంది కావ్య థాపర్. ప్రస్తుతం ఆమె గోపీచంద్‌తో కలిసి 'విశ్వం'తో అలరించేందుకు సిద్ధమైంది. ఈ చిత్రాన్ని శ్రీను వైట్ల తెరకెక్కించారు. ఇది ఈ నెల 11న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది కావ్య.

★ "శ్రీను వైట్ల ఈ కథ చెప్పినప్పుడే భలే వైవిధ్య భరితంగా ఉందనిపించింది. దీంట్లో నా పాత్ర కూడా చాలా కొత్తగా ఉంటుంది. ఇందులో దాదాపు 16మంది కమెడియన్స్ ఉన్నారు. అయితే తెరపై ఎన్ని పాత్రలు కనిపిస్తున్నా.. ఎవరి ప్రాధాన్యత వారికే ఉంటుంది. అన్ని పాత్రలు ప్రేక్షకుల్ని మెప్పించేలాగే దర్శకుడు శ్రీను ఈ కథ రాసుకున్నారు".


★ "ఈ చిత్రంలో నేను కాస్ట్యూమ్ డిజైనర్‌గా స్టైలిష్ పాత్రలో కనిపిస్తాను. నా పాత్రలో గ్రే షేడ్ కూడా కనిపిస్తుంది. అలాగే అద్భుతం నవ్విస్తుంది. ఒకరకంగా నటనకు ప్రాధాన్యమున్న గ్లామర్ పాత్రిది. అందుకే ఈ పాత్ర నాకు కాస్త సవాల్‌గా అనిపించింది".

★ "ఈ సినిమాను ఇటలీ, హిమాచల్ ప్రదేశ్, మనాలి తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. కొన్నిసార్లు మైనస్ డిగ్రీల వాతావరణంలో.. ఇంకొన్నిసార్లు ఎడారి ఉష్ణోగ్రతల వద్ద చిత్రీకరించిన సందర్భాలున్నాయి. అలాగే కొండల ఎత్తుల లాంటి కష్టతరమైన పనులు చేయాల్సి వచ్చింది. ఇవన్నీ ఎదుర్కొంటూ నటించడం శారీరకంగా సవాల్‌గా అనిపించింది".

★ "నటిగా నాకు అన్ని రకాల పాత్రలు పోషించాలని ఉంది. సైకో కిల్లర్ పాత్రలు, దెయ్యం పాత్రలు.. ఇలా సవాల్ విసిరే పాత్రలన్నీ చేయాలని ఉంది".


కావ్య థాపర్

'రేస్ 4' సన్నాహాలు


సైఫ్ అలీఖాన్

'రేస్' ఫ్రాంచైజీ చిత్రాలు బాలీవుడ్‌లో మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్నాయి. ఇప్పటికే ఇందులో రూపొందిన మూడు భాగాలు సినీప్రియులను విశేషంగా ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ ఫ్రాంచైజీలో 'రేస్ 4' రాబోతున్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ కథానాయకుడు సైఫ్ అలీఖాన్ ప్రధాన పాత్రలో ఈ నాలుగో భాగాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు నిర్మాత రమేశ్ తౌరానీ.

గురుశిష్యులుగా సల్మాన్, వరుణ్


సల్మాన్ ఖాన్

ఓ వైపు కథానాయకుడిగా తన యాక్షన్ సన్నివేశాలతో అభిమానుల్ని మురిపిస్తూనే.. మరో వైపు అవకాశం వచ్చినప్పుడల్లా అతిథి పాత్రల్లో మెరుస్తూ సినీప్రియుల్ని మెప్పిస్తుంటారు బాలీవుడ్ అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్. ఇప్పుడాయన 'బేబీ జాన్' చిత్రంలో అతిథి పాత్రలో తళుక్కున మెరవడానికి సిద్ధమయ్యారు. వరుణ్ ధావన్, కీర్తి సురేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. ఈ ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌ను కాలీస్ తెరకెక్కిస్తున్నారు. ప్రియా అట్లీ, జ్యోతి దేశ్‌పాండే సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో వరుణ్ గురువుగా సల్మాన్ కనిపించనున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఆయన తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణను పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

దసరాకి ముహూర్తం మరిన్ని విశేషాలు https://epaper.eenadu.netలో

అష్టలక్ష్ములు.. ఆరాధ్య దేవతలు

కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక ప్రాధాన్యం


ఆదిలక్ష్మిని అర్చించడం ద్వారా భక్తుడికి మహాలక్ష్మి అనుగ్రహం లభిస్తుంది


సంతాన లక్ష్మి ద్వారా యోగ్యవంతులైన సంతానం కలుగుతుంది


గజలక్ష్మి అనుగ్రహంతో ప్రశాంతత చేకూరుతుంది


ధాన్యలక్ష్మి అనుగ్రహంతో సకల జీవరాశికి ఆహారం లభ్యమవుతుంది

ఇంద్రకీలాద్రిపై స్వయంభువుగా వెలిసిన కనకదుర్గమ్మ ఆలయ చరిత్ర కృతయుగం నాటిది. త్రేతా యుగంలో శ్రీరామచంద్రుడు, ద్వాపర యుగంలో అర్జునుడు అమ్మవారిని కొలిచినట్లు స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. శ్రీకృష్ణదేవరాయలు పరిపాలనా కాలంలో ఆలయాన్ని అభివృద్ధి చేసినట్లు కొన్ని రాతి శాసనాలు స్పష్టం చేస్తున్నాయి. అనంతర కాలంలో ప్రస్తుత ఆలయాన్ని గ్రానైట్‌తో పటిష్ఠంగా నిర్మించారు. పల్లవుల శిల్ప రీతిలో చిత్రవాణం, అధిష్ఠానం, స్తంభ వర్గం, కుడ్యకోష్ఠం, ప్రస్తరం, కర్ణకూటం, ప్రస్తార వేదిక, కంఠం, శిఖరం, కలశాలను ఏర్పాటు చేశారు.

కుడ్య కోష్ఠంలో అష్టలక్ష్ములు ప్రత్యేక ఆకర్షణ.. మహా కాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి అంశలతో ఏర్పాడిన రూపం జగన్మాత దుర్గమ్మ. దుర్గమ్మ ప్రధాన ఆలయ కుడ్య కోష్ఠంలో అష్టలక్ష్ములు ప్రత్యేక ఆకర్షణ. దుర్గమ్మ ప్రధాన ఆలయం చుట్టూ గోడలో వరుసగా ఆది లక్ష్మి, సంతాన లక్ష్మి, గజలక్ష్మి, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, విజయలక్ష్మి, ఐశ్వర్యలక్ష్మి, వీరలక్ష్మి విగ్రహాలను ఏర్పాటు చేశారు. 1999 ఏప్రిల్ 19 నుంచి 22 వరకు తయాహ్నికంగా నాటి కంచి కామకోటి పీఠాధిపతులు జయేంద్ర సరస్వతి సువర్ణ శిఖరాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మహాకుంభాభిషేకం నిర్వహించారు. గతంలో ఆదిలక్ష్మికి ప్రణమిల్లి ప్రదక్షిణ చేసిన తరువాత దుర్గమ్మను దర్శించుకునేవారు. ప్రస్తుతం భక్తుల సంఖ్య గణనీయంగా పెరగడంతో అష్టలక్ష్ములను దర్శించుకునే అవకాశం లేకుండా పోయింది. అర్చకులు మాత్రం జగన్మాత దుర్గమ్మతోపాటు అష్టలక్ష్ములకు నిత్యం పూజ చేసి నివేదన సమర్పిస్తున్నారు. - ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే


ధనలక్ష్మిని పూజిస్తే మానవులకు అవసరమైన ధనానికి లోటు ఉండదు.


విజయలక్ష్మిని పూజిస్తే ఆమె చల్లని చూపుతో సకల కార్యాల్లో సాధకులకు విజయం సిద్ధిస్తుంది.


ఐశ్వర్య లక్ష్మి అనుగ్రహంతో అష్టైశ్వర్యాలు లభిస్తాయి.


వీరలక్ష్మి(ధైర్యం) మనతో ఉంటే ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా ఎదుర్కొనే శక్తి అభిస్తుంది. తద్వారా మిగతా లక్ష్ములు కూడా అండగా నిలుస్తారని దేవస్థానం పురాణ పండిట్ వెంకటేశ్వర శర్మ తెలిపారు.

విశిష్టం.. ఉపాలయాల దర్శనం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను దర్శించుకునేందుకు దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. అయితే ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయంతోపాటు మరికొన్ని ఉపాలయాలు సైతం ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకొని పూజలు చేస్తే చేపట్టిన విజయవంతం అవుతాయని భక్తుల విశ్వాసం. ఇంద్రకీలాద్రిపై ఉపాలయాలైన మల్లేశ్వరాలయం, నటరాజస్వామి ఆలయం, క్షేత్రపాలక ఆంజనేయస్వామి ఆలయాలకు విశిష్ట ఆదరణ ఉంది. ప్రాచీన కాలంలో మల్లేశ్వరాలయాన్ని నిర్మించారు. మల్లేశ్వరాలయంలో క్షేత్రపాలకుడు కాలభైరవుడు, నందీశ్వరుడి దర్శనం తరువాత స్వామి వారిని దర్శించుకుంటారు.

మల్లేశ్వరాలయం



కృత యుగంలో చతుర్ముఖుడైన బ్రహ్మదేవుడు ఇక్కడ స్వామి వారిని మల్లికా పుష్పాలతో పూజించడంతో మల్లేశ్వరుడు అని పేరు వచ్చినట్లు పండితులు చెబుతున్నారు. దాతల సహకారంతో 2017 నుంచి ఆలయ పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. దాత సంకా నరసింహారావు రూ.5కోట్ల వ్యయంతో మల్లేశ్వరాలయాన్ని 200 మీటర్లు విస్తరణకు సహకరించారు. దుర్గమ్మ దర్శనం చేసుకున్న భక్తులు మల్లేశ్వరాలయాన్ని సందర్శించి కనకదుర్గానగర్ వెళ్లేందుకు విశాలమైన మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేశారు. గడ్డర్లతో మల్లేశ్వరాలయాన్ని విస్తరించారు. తరువాత రూ. 6కోట్ల వ్యయంతో దేవస్థానం మల్లేశ్వరాలయ పునర్నిర్మాణ పనులు చేసింది. ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేయడంతోపాటు ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు మల్లేశ్వర స్వామిని దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు.

నాట్యకళా కేంద్రంగా నటరాజస్వామి ఆలయం



ఇంద్రకీలాద్రిపై వినాయక నటరాజ శివకామ సుందరీదేవి ఆలయానికి ప్రత్యేకత ఉంది. చక్కటి శిల్పకళా నైపుణ్యంతో కూడిన మండపంతో ఈ కోవెలను తీర్చిదిద్దారు. మొదటి ఆలయంలో వినాయకుడు, రెండో ఆలయంలో నటరాజస్వామి, మూడో ఆలయంలో శివకామసుందరీదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. దుర్గామల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్న భక్తులు ఇక్కడ కొంత సేద తీరేవారు. గతంలో ఇక్కడ కళాప్రదర్శనలు ఇచ్చేవారు. ప్రస్తుతం దేవస్థానంలోని రాజగోపుర ప్రాంగణంలో కళావేదిక ఏర్పాటు చేయడంతో కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఈ ఉపాలయం పరిమితమైంది.

నాగేంద్ర స్వామి పుట్ట వద్ద సుబ్రహ్మణ్య స్వామి ఆలయం



నాగేంద్ర స్వామి పుట్ట వద్ద నాగుల చవితికి పాలు పోసేందుకు మహిళా భక్తులు తరలివస్తారు. నిత్యం భక్త జన సంచారం ఉండేందుకు వీలుగా ఇక్కడ శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయాన్ని నిర్మించారు. తల్లిని దర్శించుకున్న భక్తులు తనయుడైన సుబ్రహ్మణ్యుడి ఆశీస్సులు తీసుకునేందుకు ఇక్కడికి వస్తారు. ప్రతి నెల సుబ్రహ్మణ్య షష్ఠి రోజున స్వామి వారి కల్యాణానికి విశేష ఆదరణ ఉంది.

క్షేత్ర పాలక ఆంజనేయ స్వామికి బంగారు కవచం

ఏ క్షేత్రంలోనైనా తొలుత క్షేత్రపాలకుడి దర్శనం పూర్తి చేసుకున్న తరువాత మాత్రమే క్షేత్ర దేవుడిని దర్శించుకుంటారు. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనం చేసుకునే భక్తులు కూడా తొలుత క్షేత్రపాలకుడిని దర్శించుకునేవారు. కాలక్రమంలో భక్తుల సంఖ్య గణనీయంగా పెరగడంతో క్యూలైన్లు వేయడంతో భక్తులు క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామిని దర్శించుకునే అవకాశం లేకుండా పోయింది. ఉచిత దర్శన క్యూలో వచ్చే భక్తులకు మాత్రం ఈ వాయుపుత్రుడి దర్శనం లభిస్తుంది. క్షేత్రపాలకుని విశిష్టతను గుర్తించి దాతలు రూ.కోట్ల విలువ చేసే బంగారు కవచం, కిరీటాన్ని గత ఏడాది అందజేశారు. ఘాట్ రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద నడచి వచ్చే భక్తులు మాత్రమే దర్శించుకుంటున్నారు.

ఘాట్ రోడ్డు ముఖద్వారంలో..

దుర్గమ్మ దర్శనానికి ఘాట్ రోడ్డు మార్గంలో వచ్చే భక్తులు కామధేను అమ్మవారిని దర్శించుకుంటారు. కోరిన వరాలు ఇచ్చే దుర్గమ్మ దర్శనానికి నేరుగా రాలేని వారి కోసం జాతీయ రహదారి పక్కన కామధేను శిల్క్స్ వారు ఇక్కడ వినాయకుడి ఆలయంతోపాటు అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. జాతీయ రహదారిపై వెళ్లే వారు కామధేను అమ్మవారిని దర్శించుకుంటారు. రెండు ఆలయాలకు కలిపి మండపాన్ని నిర్మించి నిత్యం నివేదనార్చనను రుత్వికులు నిర్వహిస్తున్నారు

నేటి అలంకారం 7-10-2024, సోమవారం

శ్రీ మహా చండీ దేవి

శరన్నవరాత్రి మహోత్సవాలలో ఐదోరోజు కనకదుర్గమ్మ శ్రీ మహాచండీ దేవిగా దర్శనమిస్తారు. దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కొరకు మహాలక్ష్మీ, మహాకాళీ, మహా సరస్వతి త్రిశక్తి స్వరూపిణిగా శ్రీ మహాచండీ అమ్మవారు ఉద్భవించింది. శ్రీ చండీ అమ్మవారిలో అనేక మంది దేవతలు కొలువై ఉన్నారు. శ్రీ మహాచండీ అనుగ్రహం వలన విద్య, కీర్తి, సంపదలు లభించి శత్రువులు మిత్రులుగా మారటం, ఏ కోరికలతో ప్రార్థిస్తామో ఆ కోరికలు అన్నీ సత్వరమే లభిస్తాయని భక్తజనుల నమ్మకం.


దేవానాం కార్యసిద్ధ్యర్థం ఆవిర్భవతి సా యదా!
ఉత్పన్నేతి తదా లోకే సానిత్యాప్యభిధీయతే!

దేవాదాయ శాఖలో సమూల మార్పులకు చర్యలు

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దేవాదాయ శాఖలో సమూల మార్పులకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. దసరా వేడుకల్లో ఆదివారం లలితాత్రిపుర సుందరీ దేవి అలంకారంలో ఉన్న జగన్మాత దుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ సాంప్రదాయల విషయంలో అధికారులు జోక్యం చేసుకోవద్దని సూచించారు. దేవతామూర్తులకు జరిగే కైంకర్యాలు ఆగమ సాంప్రదాయం ప్రకారం నిర్వహించాల్సిందేనని స్పష్టం చేశారు. ఆగమశాస్త్రానికి విరుద్ధంగా అధికారులు నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. ధూప, దీప నైవేద్యాల కింద రూ.50వేల వార్షిక ఆదాయం కలిగిన ఆలయాలకు రూ.10 వేల మొత్తాన్ని ఇస్తామన్నారు. ట్రస్టుబోర్డులో సైతం బ్రాహ్మణులు, నాయిబ్రాహ్మణులకు చోటు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీని కోసం అవసరమైతే శాసనసభలో తీర్మానం చేసి చట్ట సవరణ చేస్తామన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో ఆదాయం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో నాలుగో రోజు ఆదివారం రికార్డు స్థాయిలో రూ.66.33 లక్షల ఆదాయం లభించింది. లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో ఉన్న జగన్మాత దుర్గమ్మను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. క్యూలైన్లో బారులు తీరిన వేలాది భక్తులు అమ్మవారిని దర్శించుకున్న తరువాత ప్రసాదాల కౌంటర్ల వద్దకు చేరడంతో రద్దీ ఏర్పడింది. ఒక దశలో ప్రసాదం అందుతుందో లేదోనన్న ఆందోళన అధికారుల్లో కనిపించింది. లడ్డూల విక్రయం ద్వారా రూ.22.16లక్షలు, రూ.500, రూ.300, రూ. 100 దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.28.82 లక్షలు, రూ.8.82లక్షలు, రూ.5.39 లక్షల ఆదాయం వచ్చింది. 2,892 మంది తలనీలాల సమర్పించారు. తద్వారా దేవస్థానానికి రూ.1.14 లక్షలు ఆదాయం లభించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

